కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని    తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ    సంపుటి :05    సంచిక :116    ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్    శుక్రవారం 21-08-2026    పేజీలు : 4    వెల : రూ. 3/-

## మణిపూర్‌లో మళ్లీ నిరసనలు.. మూడు రోజుల పాటు విద్యాసంస్థలు బంద్

ఇంఫాల్: బీజేపీ పాలిత మణిపూర్‌లో మళ్లీ నిరసనలు ఉధృతమయ్యాయి. దీంతో శాంతిభద్రతల పరిస్థితి కారణంగా స్కూల్స్, కాలేజీలు, విద్యా సంస్థలను మూడు రోజులపాటు మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మణిపూర్‌లో జనాభా గణనకు ముందే జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ)ని నవీకరించాలని ప్రజలు కోరుతున్నారు. అంతర్గతంగా స్థానభ్రంశం చెందిన వ్యక్తులు (ఐడీపీలు) తమ స్వస్థలాలకు తిరిగి వచ్చేవరకు జనాభా గణన నిర్వహించవద్దని డిమాండ్ చేస్తున్నారు. న్యాయమైన, నిష్పక్షపాత పునర్విభజన ప్రచార సంస్థ (జేఎఫ్‌డీ) వేదికగా దీనిపై పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 48 గంటల సార్వత్రిక సమ్మెకు జేఎఫ్‌డీ పిలుపునిచ్చింది. కాగా, సమ్మెలో భాగంగా మణిపూర్ లోయ జిల్లాలలోని పలు ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు జరిగాయి. ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్, బిష్ణుపూర్, తౌబల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రోడ్లను దిగ్బంధించారు. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖురాయ్ లామ్‌లాంగ్‌లో సీఎం ఖేమ్‌చంద్ సింగ్, హోం మంత్రి గోవిందాస్ కొంతౌజమ్‌ల దిష్టిబొమ్మలను నిరసనకారులు దహనం చేశారు. మరోవైపు సార్వత్రిక సమ్మెలో భాగంగా నిరసనలు కొనసాగడంతో గురువారం నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలను బహిష్కరిస్తున్నట్లు జేఎఫ్‌డీ




ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితి కారణంగా ఆగస్ట్ 20 నుంచి 22 వరకు రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలను మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్లు మణిపూర్ ప్రభుత్వం ప్రకటించింది. తౌబల్ జిల్లాలో ఏర్పాటు చేసిన జనగణన శిక్షణా కార్యక్రమాన్ని కూడా రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## సీఐ రఘుపతి రెడ్డిని అర్జెంట్‌గా సస్పెండ్ చేయాలి



హైదరాబాద్, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని తెలిసిందే. కలెక్టరేట్ ముట్టడికి యత్నించిన విద్యార్థుల్లో ఇద్దరు విద్యార్థులను సీఐ రఘుపతి రెడ్డి గొంతు పట్టుకుని నెట్టేసిన విజువల్స్ పోలీసుల దౌర్జన్యాన్ని కండ్లకు కట్టినట్టు చూపిస్తున్నాయి. శక్తి స్కీమ్‌లో పాలిటెక్నిక్ కాలేజీని విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మద్దతు తెలిపారు. విద్యార్థుల పట్ల పోలీసుల దురుసు ప్రవర్తనపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. మహబూబాబాద్‌లో జాటోత్ రాజేష్ అనే పాలిటెక్నిక్ విద్యార్థి గొంతు పట్టి సీఐ రఘుపతి రెడ్డి దాడి చేశాడు. మీరు పీపుల్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటున్నారు కదా.. ఈ పీపుల్ ఫ్రెండ్లీ పోలీసింగ్ ఏమో కానీ మీరు మా పిల్లలను గొంతు పట్టి చంపే ప్రయత్నం చేసిన సీఐ రఘుపతి రెడ్డిని అర్జెంట్‌గా సస్పెండ్ చేయాలని నేను డీజీపీని డిమాండ్ చేస్తున్నానన్నారు. మాసబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కాలేజీ ఎదురుగా విద్యార్థులు చేస్తున్న ధర్నాకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లి వ బీఆర్ఎస్వీ నాయకుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను, తుంగ బాలు విద్యార్థుల తరపున పోరాటం చేస్తుంటే.. బీఆర్ఎస్వీ నాయకులను అరెస్ట్ చేయడాన్ని మేం పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రజలు గుర్తు పెట్టుకోవాలి. ఈ ముఖ్యమంత్రికి ఈ విద్యార్థుల భవిష్యత్ మీద ఏ మాత్రం శ్రద్ధ లేదు.

## మహేష్ గౌడ్ మాటల వెనక మర్మమేంటి...

హైదరాబాద్,అసలు తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో, ప్రభుత్వంలో ఏం జరుగుతుంది ? ఎవరు దేనిని నడిపిస్తున్నారు ? ఎవరు దేనిని నియంత్రిస్తున్నారు ? ఎవరి వెనక ఎవరున్నారు ? ఎవరు ? ఎవరితో మాట్లాడిస్తున్నారు ? అసలు ఆ మాటల వెనక మర్మం ఏంటి ? కొందరి మౌనం వెనక మర్మం ఏంటి ? అన్నది తీవ్ర చర్చానీయాంశంగా మారింది. బుధవారం వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన మంత్రి సురేఖ జన్మదిన వేడుకలలో ఆమె కూతురు సుష్మిత రేవంత్ రెడ్డి మీద సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. పరకాల నియోజకవర్గం నుండి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాష్ రెడ్డి పోటీ చేస్తాడని ప్రకటించడానికి రేవంత్ రెడ్డి ఎవరని, వచ్చే ఎన్నికల్లో తాను ఇక్కడి నుండి పోటీ చేస్తానని, చేతనైతే రేవంత్ రెడ్డి ఓడించాలని, గత ఎన్నికల్లో తన తండ్రి కొండా మురళి దగ్గరుండి రేవూరి ప్రకాష్ రెడ్డిని గెలిపించాడని, ఈ సారి తనకు టికెట్ రాకున్నా స్వతంత్రంగా నిలబడి గెలుస్తానని సుష్మిత రేవంత్ రెడ్డికి సవాల్ విసిరింది. దీంతో నిన్న రాత్రి కొండా సుష్మిత వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం నోటీసులు జారీచేసింది. దానికి ఇంకా కొండా సురేఖ వివరణ కూడా ఇవ్వలేదు. సుష్మిత ఆరోపణలపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి స్పందించకపోగా, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు సుష్మిత అసలు కాంగ్రెస్ కార్యకర్త కాదని, ఆమెకు పరిణతి లేదని, రేవంత్ ను అనే స్థాయి కాదని అన్నారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి సన్నిహితులు, వేం నరేందర్ రెడ్డి సన్నిహితులు, మంత్రి పొంగులేటి సన్నిహితులు గానీ ఇంత వరకు



స్పందించకుండా మౌనం వహించారు. ఈ మౌనం వెనక కారణాలు ఏంటి అని కాంగ్రెస్ పార్టీలో చర్చ జరుగుతుంది. కానీ అంతలోనే పార్టీ అధ్యక్షుడుగా మహేష్ కుమార్ గౌడ్ బాంబు పేల్చారు. 'ఎమ్మెల్యే అభ్యర్థిని రేవంత్ రెడ్డి ప్రకటించినంత మాత్రాన చెల్లదని, ఎమ్మెల్యే అభ్యర్థులను నిర్ణయించేది కాంగ్రెస్ అధిష్టానం మాత్రమే' అని పీసీసీ అధ్యక్షుడి హోదాలో అన్నారు. సుష్మిత ఆరోపణల నేపథ్యంలో ఆక్రోశంగా ఉన్న రేవంత్ వర్గం మీద మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు పుండు మీద కారం చల్లినట్లుందని అంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తికి ఒక నియోజకవర్గ అభ్యర్థిని నిర్ణయించి, అధిష్టానాన్ని ఒప్పించే సమర్థత లేదా ? అన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరి ఈ వివాదాలు ఎటువైపు దారి తీస్తాయో వేచిచూడాలి.

## కాంగ్రెస్ నేత సజ్జన్ కుమార్ కన్నుమూత



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ కన్నుమూశారు. 1984 నాటి సిక్కు అల్లర్ల కేసులో ఆయన జీవితకాల శిక్షను అనుభవిస్తున్నారు. ఢిల్లీలోని సఫ్దార్‌జంగ్ ఆస్పత్రిలో ఆయన ప్రాణం విడిచారు. తీహార్ జైలు నుంచి ఆయన్ను చివరి క్షణాల్లో ఆస్పత్రికి తరలించారు. ఆయన వయసు 80 ఏళ్లు. చాన్నాళ్లుగా పలు రకాల రుగ్మతలతో ఆయన బాధపడుతున్నారు. ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు గత ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన సజ్జన్ కుమార్‌ను దోషిగా తేల్చింది. ఆ తర్వాత ఆయనకు ఆ కేసులో జీవితకాల శిక్షను విధించింది. సజ్జన్ కుమార్‌కు మరణశిక్ష విధించాలని కోరుతూ సిక్కు అల్లర్ల బాధితులు డిమాండ్ చేశారు. మూడు సార్లు ఆయన లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఔటర్ ఢిల్లీ నియోజకవర్గం నుంచి ఆయన పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ప్రముఖ నేతగా గుర్తింపు ఉన్నది. 2018లో దోషిగా తేలడంతో ఆయన పార్టీకి రాజీనామా చేశారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య తర్వాత ఢిల్లీలో అల్లర్లు చోటుచేసుకున్నాయి. 1984 అక్టోబర్ 31వ తేదీన ఇందిరా గాంధీ బాడీగార్డులు సత్వంత్ సింగ్, బియాంత్ సింగ్ ఆమె హత్యకు పాల్పడ్డారు. అయితే ఆ హత్య నేపథ్యంలో సిక్కులపై ఢిల్లీలో ఊచకోత జరిగింది. సిక్కుల ఇండ్లు, షాపులపై దాడి చేశారు. సుమారు 3వేల మంది సిక్కులను హతమార్చారు. జశ్వంత్ సింగ్‌తో పాటు ఆయన కుమారుడి హత్య కేసులో సజ్జన్ కుమార్ నిందితుడిగా ఉన్నారు. ఇందిరా గాంధీ మరణం తర్వాత ఇద్దరు సిక్కులను హతమార్చిన కేసులో మరో వ్యక్తి యశ్‌పాల్ మాలిక్‌కు మరణశిక్ష వేశారు. ఇక ఇదే ఘటనతో లింకున్న కిషోరి లాల్ అనే వ్యక్తికి కూడా 1996లోనే మరణశిక్ష విధించారు. కానీ సిక్కుల మర్డర్ కేసులో సజ్జన్ కుమార్‌కు కేవలం జీవితకాల శిక్ష పడింది. కాంగ్రెస్ పార్టీ సజ్జన్ కుమార్‌ను రక్షించిందని అకాలీదళ్ పార్టీ ఆరోపించింది. సిక్కుల హత్య కేసుల్లో ఆయన పాత్ర ఉన్నా.. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఆయనకు అండగా నిలిచిందని అకాలీదళ్ ఆరోపించింది. 2004 వరకు ఆయన కాంగ్రెస్ ఎంపీగా కొనసాగారు. 2009 జనరల్ ఎలక్షన్స్‌లో కాంగ్రెస్ పార్టీ ఆయనకు టికెట్ ఇవ్వలేదు. ఆయన స్థానంలో ఆయన సోదరుడు రమేశ్ కుమార్‌ను నిలబెట్టారు. 2009లో రమేశ్ కుమార్ ఎన్నికయ్యారు. కానీ 2014 సాధారణ ఎని?్నలో ఓడిపోయారు.

## భాషను మార్చుకో..నోటిని అదుపులో పెట్టుకో



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన భాష ను మార్చుకోవాలని, నోటిని అదుపులో పెట్టుకోవాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. గురువారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బాధ్యత గల పదవిలో ఉంటూ గౌరవం, సంస్కారం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. కరోనా సమయంలో సరిపడా ఆక్సిజన్, బెడ్ లు లేక ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్ అవసరాల కోసం ముందు చూపుతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం సనత్ నగర్, అల్వాల్, కొత్తపేట ప్రాంతాలలో కార్పొరేట్ స్థాయి హాస్పిటల్స్ నిర్మాణ పనులు చేపట్టిందని వివరించారు. తమ ప్రభుత్వ హయాం లోనే 60 శాతం పనులు పూర్తయ్యాయి అనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. సనత్ నగర్ టిమ్స్‌ను కట్టామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకోవడం అవివేకమని విమర్శించారు. హాస్పిటల్ లో అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించకుండా హడావుడిగా ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. హాస్పిటల్ ప్రారంభోత్సవ సభలో అధికారిక కార్యక్రమం అనే సోయి లేకుండా వైద్యులు, నర్సింగ్ విద్యార్థుల ముందు ముఖ్యమంత్రి నోటికొచ్చినట్లు పచ్చి అబద్దాలు మాట్లాడారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి రిబ్బన్ కటింగ్ లు చేస్తున్నారని ఆరోపించారు. తమకు సంస్కారం అడ్డం వస్తుందని, లేదంటే మీకన్నా ఎక్కువ మాట్లాడగలమని చెప్పారు. ప్రజాపాలన అని ఒక వైపు ప్రచారం చేసుకుంటూ మరో వైపు నిర్బంధాలు, అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

### కమిషన్ ల కోసమే 22 ఏ

కమిషన్ ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం 22 ఏ తీసుకొచ్చిందని తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజల ఇండ్లు, ప్రయివేట్ భూములను 22 ఏ లో చేర్చే అధికారం మీకు ఎవరు ఇచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 22 ఏ ను అడ్డం పెట్టుకొని భూముల యజమానులను భయపెట్టి 30 నుండి శాతం కమిషన్ లను వసూలు చేసిన మాట వాస్తవం కాదా? అని నిలదీశారు.

## మంత్రి పొంగులేటి క్షమాపణ చెప్పడం సిగ్గుచేటు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈరోజు(గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. ఎవరు చెప్తే భూములను నిషేధిత జాబితాలో పెట్టారో మంత్రి పొంగులేటి చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రజాపాలన లేదని.. దోపిడి పాలన ఉందని విమర్శించారు. భూదందాలు చేస్తూ ప్రజల భూములను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో చేరిందన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పడం సిగ్గు చేటని ఎంపీ అన్నారు. అధికారులను బాధ్యులుగా చేయడం కాదని.. దీనికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22 ఏ జాబితాను బహిర్గతం చేయాలన్నారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 22ఏ భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. భూములు నిషేధిత జాబితాలో పెట్టారని స్వయంగా మంత్రి కోమటిరెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేశారని అన్నారు. తెలంగాణలో భూముల పేరుమీద కుంభకోణాలు, సెటిల్మెంట్, దందాలు బయట పడుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో భూములు కాజేయాలని చూస్తే రేవంత్ రెడ్డి పీసీసీగా ఉండి పోరాటం చేశారని..



భూములు కాపాడుతామని చెప్పారని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని రేవంత్ అన్నారని లక్ష్మణ్ తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో అంటే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలోకి నెట్టిందని విమర్శించారు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మంత్రులు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ఆస్తులు భద్రంగా ఉండాలంటే ఆర్మీని దింపాలని ఇటీవల హైకోర్టు వ్యాఖ్యలు చేసిందన్నారు. ఎవరి ఇళ్లు ఎప్పుడు నిషేధిత జాబితాలోకి వెళ్తుందో అని ప్రజలు భయపడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

## భారత దేశానికి కంప్యూటర్లను పరిచయం చేసింది రాజీవ్ గాంధే



ధర్మపురి: నేడు ప్రపంచ దేశాలతో పోటీపడి ప్రపంచం గర్వించే విధంగా భారతదేశం ఎదగడానికి కారణం దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్మపురి పట్టణంలోని నంది చౌరస్తాలో నిర్వహించిన జయంతి వేడుకల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.... రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో భారత దేశానికి కంప్యూటర్లను పరిచయం చేశారని గుర్తు చేశారు. వారి స్ఫూర్తితో మొదలైన కంప్యూటర్ ఈరోజు సాఫ్ట్ వేర్ రంగంలో భారతదేశానికి ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చిందని ప్రశంసించారు. లక్షలాదిమంది నైపుణ్యం పెంచుకొని ప్రపంచ దేశాల్లో సాఫ్ట్ వేర్ రంగాల్లో స్థిరపడ్డారని తెలియజేశారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే యువతకు ఎన్నికల్లో అవకాశం కల్పించాలని ఓటు హక్కు వయసు 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించి భారతదేశ ప్రజాస్వామ్యంలో యువతను భాగస్వాములను చేశారని అన్నారు. దేశ ఐక్యత కోసం రాజీవ్ గాంధీ అనేక కార్యక్రమాలు నిర్వహించి ముందుకు సాగారని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. దేశ ప్రజల కోసం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వంటి మహనీయులు ప్రాణ త్యాగాలు చేశారని మంత్రి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. నేటి యువత రాజీవ్ గాంధీని స్ఫూర్తిగా తీసుకొని దేశ ఐక్యతకు సమగ్రతకు పాటుపడాలని మంత్రి పిలుపునిచ్చారు.

### కాకరేపుతున్న వెంకటస్వామి విగ్రహ ఆవిష్కరణ

మంచిర్యాల : మంచిర్యాల జిల్లాలో కాకా విగ్రహ ఆవిష్కరణ రాజకీయంగా కాక రేపుతోంది. జిల్లా కాంగ్రెస్‌లో మళ్లీ వర్గ విభేదాలు తలెత్తడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో కొన్నేళ్లుగా కవర్‌తో కప్పి ఉంచిన కాకా గడ్డం వెంకటస్వామి విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు వ్యతిరేక వర్గానికి చెందిన మంతెన జగన్‌మోహన్‌రావు, మాజీ వైస్ చైర్మన్ ఉప్పలయ్యతో పాటు భారీ సంఖ్యలో కార్యకర్తలు కవర్ తొలగించి



## సంపాదకీయం

శుక్రవారం 21-08-2026

# ఉరికి బదులు ఇంజెక్షన్...

భారతదేశంలో మరణశిక్ష అమలు విధానంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు చెప్పింది. భారతదేశంలో మరణశిక్ష అమలు విధానంపై మరోసారి కీలక చర్చ తెరపైకి వచ్చింది. ఉరిశిక్షకు బదులుగా తక్కువ బాధాకరమైన, మరింత మానవీయమైన పద్ధతిని అమలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వం, నిపుణుల పరిశీలన, న్యాయస్థానం ముందున్న రాజ్యాంగపరమైన ప్రశ్నలపై ఆధారపడనుంది.జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ అంశాన్ని విచారిస్తోంది. న్యాయవాది రిషి మల్హోత్రా దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రస్తుతం అమల్లో ఉన్న ఉరిశిక్ష విధానాన్ని సవాల్ చేశారు. ఉరి ద్వారా మరణశిక్ష అమలు చేయడం క్రూరమైన, అమానవీయమైన పద్ధతిగా మారే అవకాశం ఉందని ఆయన వాదించారు. మరణశిక్ష విధించిన వ్యక్తికి కూడా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించే గౌరవంతో జీవించే హక్కు, దానికి అనుబంధంగా గౌరవప్రదమైన ప్రక్రియకు సంబంధించిన హక్కులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.పిటిషనర్ ప్రధానంగా ఉరిశిక్షకు ప్రత్యామ్నాయంగా ప్రాణాంతక ఇంజెక్షన్ వంటి పద్ధతులను పరిశీలించాలని కోరారు. అంతేకాకుండా కాల్పివేత, విద్యుద్ఘాతం, గ్యాస్ ఛాంబర్ వంటి ఇతర పద్ధతులను కూడా తన పిటిషన్‌లో ప్రస్తావించారు. అయితే ఏ పద్ధతి నిజంగా తక్కువ బాధాకరమైనది, మానవీయమైనది అనే విషయాన్ని శాస్త్రీయ ఆధారాలతో పరిశీలించాల్సిన అవసరం ఉందని వాదించారు. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యామ్నాయ పద్ధతుల అంశాన్ని పూర్తిగా పక్కన పెట్టలేదు. గత విచారణల్లో నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి, మరణశిక్ష అమలు కోసం ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నట్లు కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. వైద్య, న్యాయ రంగాలకు చెందిన నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకునే ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది. 2026 జనవరి 22న జరిగిన విచారణలో సుప్రీంకోర్టు వెంటనే తుది తీర్పు ఇవ్వకుండా ఆదేశాలను రిజర్వ్ చేసింది. పిటిషనర్, కేంద్ర ప్రభుత్వం తమ లిఖితపూర్వక వాదనలు సమర్పించేందుకు మూడు వారాల సమయం ఇచ్చింది.ఇదిలా ఉండగా, ప్రస్తుత చట్టపరమైన వ్యవస్థలో మరణశిక్ష అమలు విధానం ఉరిశిక్షగానే కొనసాగుతోంది. పాత అతీకఆలోని సెక్షన్ 354(5)కు సమానమైన నిబంధన ప్రస్తుతం భారతీయ నాగరిక్ సురక్షా సంహిత లోని సెక్షన్ 393(5)లో ఉంది. మరణశిక్ష విధించిన వ్యక్తిని ఉరి ద్వారా మరణించే వరకు శిక్ష అమలు చేయాలని ఈ నిబంధన పేర్కొంటుంది. ఉరిశిక్ష రాజ్యాంగబద్ధతపై గతంలోనూ సుప్రీంకోర్టు పరిశీలన జరిపింది. 1983లో 'దీనా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో ఉరి ద్వారా మరణశిక్ష అమలు చేయడం రాజ్యాంగబద్ధమేనని కోర్టు తీర్పు ఇచ్చింది. ఇప్పుడు పిటిషనర్ మాత్రం మారిన శాస్త్రీయ ప్రమాణాలు, మానవ హక్కుల దృక్పథం, గౌరవంతో కూడిన జీవితం అనే రాజ్యాంగ భావనల నేపథ్యంలో ఈ అంశాన్ని మరోసారి పరిశీలించాల్సిన అవసరం ఉందని వాదిస్తున్నారు.అయితే ప్రత్యామ్నాయ పద్ధతిని అమలు చేయడం అంత సులభమైన నిర్ణయం కాదు. ఏ విధానం తక్కువ బాధాకరమైనది? దాన్ని శాస్త్రీయంగా ఎలా నిర్ధారించాలి? వైద్య నిపుణుల పాత్ర ఎంతవరకు ఉండాలి? మరణశిక్ష విధించిన వ్యక్తికి అమలు పద్ధతిని ఎంచుకునే అవకాశం ఇవ్వాలా? వంటి అనేక ప్రశ్నలకు సమాధానం అవసరం. అందుకే ఈ కేసు కేవలం ఉరిశిక్షకు ప్రత్యామ్నాయం గురించిన వివాదంగా కాకుండా, మరణశిక్షను ఒక రాష్ట్రం ఎలా అమలు చేయాలి? శిక్ష అమలులోనూ మానవ గౌరవానికి స్థానం ఉందా? అనే కీలక రాజ్యాంగ ప్రశ్నగా మారింది.ప్రస్తుతం ఉరిశిక్షకు ప్రత్యామ్నాయ పద్ధతిని సుప్రీంకోర్టు అధికారికంగా ఆమోదించిందని చెప్పడం సరికాదు. కేంద్రం పరిశీలన, నిపుణుల అభిప్రాయాలు, పిటిషనర్ వాదనలు, రాజ్యాంగపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం ఈ వ్యవహారంలో తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది. ఉరి తీయడంలో ప్రాణాలు తీసేందుకు తక్కువ నొప్పిని కలిగించే ప్రత్యామ్నాయ పద్ధతులను అమలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. దేశంలో ఉరిశిక్ష అమలు విధానం యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది.ఉరితీయడం అనేది చాలా బాధాకరమైన, అమానవీయమైన పద్ధతి అని పిటిషనర్, న్యాయవాది రిషి మల్హోత్రా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఉరిశిక్ష అమలు చేసిన తర్వాత మరణించినట్లు ప్రకటించే మొత్తం ప్రక్రియ 40 నిమిషాలకు పైగా పడుతుందని, అదే ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వడం లేదా కాల్చి చంపడం లాంటి పద్ధతుల ద్వారా ఐదు నిమిషాల్లోనే ప్రక్రియ పూర్తవుతుందని ఆయన వివరించారు భవిష్యత్తులో శాస్త్రీయ, వైద్యపరంగా బలమైన ఆధారాలు లభిస్తే ఈ అంశాన్ని మరోసారి పరిశీలించే అవకాశం ఉందని తెలిపింది. ఉరిశిక్ష అమలులో ఉన్న ఇతర ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కావాలనుకుంటే ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసుకోవచ్చని సూచించింది.దీనిపై కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి స్పందిస్తూ, ప్రత్యామ్నాయ పద్ధతులను పరిశీలించడానికి ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు కోర్టుకు తెలిపారు. కాగా 2025 అక్టోబర్ 15న జరిగిన విచారణలో పాత పద్ధతిని మార్చడానికి కేంద్రం సుముఖంగా లేకపోవడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.దోషులకు ఉరి లేదా ఇంజెక్షన్ విధానాల్లో ఒకదాన్ని ఎంచుకునే ఆప్షన్ ఇవ్వాలన్న ప్రతిపాదన ఆచరణాత్మకంగా సాధ్యం కాదని కేంద్రం అఫిడవిట్‌లో పేర్కొంది. దీనిపై స్పందించిన కోర్టు, కాలంతో పాటు విషయాలు మారుతున్నాయని, పాత పద్ధతిని మార్చుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడమే అసలు సమస్య అని వ్యాఖ్యానించింది. ఈ కేసుకు సంబంధించి జనవరి 22నే విచారణ పూర్తి చేసిన సుప్రీంకోర్టు తాజాగా తన తీర్పును వెలువరించింది.

# కాంగ్రెస్‌లో 'పరకాల' గడ్డపై మూడు ముక్కలాట

హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన సొంత పార్టీలో కొత్త కుంపటి రాజేసింది. సీఎం పర్యటన వల్ల ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి ఒనగూరిన ప్రయోజనమెంతోగానీ, ఆ పార్టీలో అంతర్గతంగా పరకాల నియోజకవర్గం చుట్టూ నెలకొన్న రాజకీయ వర్గపోరుకు తెరదించారా? లేక కొత్తగా తెరలేపారా? అనే ఆసక్తి కరమైన చర్చ రాజకీయవర్గాల్లో షురువైంది. సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మరోసారి గెలుస్తారని, వచ్చే ఎన్నికల్లో తిరిగి పోటీచేస్తారంటూ సీఎం రేవంత్ ప్రకటించడం ఒక సాధారణ సానుకూల ప్రకటనగానే కనిపిస్తున్నప్పటికీ నియోజకవర్గ కాంగ్రెస్‌లో నెలకొన్న ప్రత్యేకతల రీత్యా సొంత పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది. వరంగల్ కాంగ్రెస్ పార్టీలో సీఎం ప్రకటన కుంపటి రాజేసిందని కొందరు భావిస్తుండగా, అంతర్గతంగా ఉన్న విభేదాలకు తెరదించుతూ స్పష్టమైన ప్రకటన చేశారంటూ మరి కొందరు భావిస్తున్నారు. సీఎం ప్రకటన రేవూరి వర్గంలో సంతోషాన్ని నింపగా, కొండా వర్గంలో నిరాశ కనిపిస్తున్నది. కొందరు నాయకులు అవకాశవాదంతో వ్యవహరించినా నియోజకవర్గంలో పార్టీని కాపాడింది తానేనంటూ ఇనుగాల తన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వసేవలను ఉపయోగించడం

అసలు ఈ పరకాల గడ్డ...అడ్డా కథేంటీ!?

పరకాలలో సీఎం రేవంత్ ప్రకటన పై భిన్న రకాల చర్చలు సాగుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికి మరోసారి పోటీచేసే చాన్సు... అది కూడా ఇంకా ఎన్నికలు రెండేళ్ళ ముందే ప్రకటన చేస్తే ఇంత రాజకీయ వివాదానికి, రాద్ధాంతానికి ఎందుకు కారణమవుతోందంటూ భిన్న చర్చసాగుతోంది. అసలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఈ పరకాల గడ్డ... అడ్డా కథేంటనే చర్చ సాగుతోంది. ఈ కథ వెనుక కారణాలను ఒకసారి పరిశీలిద్దాం.

పదేండ్ల తర్వాత కాంగ్రెస్‌కు అవకాశం

తెలంగాణ ప్రజల అనేక పోరాటాలు, వందలాది మంది త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కల సాకారమైంది. 2014లో అప్పటి యుపీఎ ప్రభుత్వం రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. ఈ సదవకాశాన్ని ఉపయోగించుకుని ప్రత్యేక రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తెచ్చుకోవడంలో అప్పటి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం మూకుమ్మడిగా విఫలమైంది. దీనికి కాంగ్రెస్ అధిష్టానం అనుసరించిన వైఖరి కూడా కారణమనే అభిప్రాయం ఆ పార్టీలో కూడా ఉంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని తెలంగాణ ఉద్యమ పార్టీగా గుర్తింపు పొందిన అప్పటి టీఆర్ఎస్, ప్రస్తుత బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. కేసీఆర్ ముఖ్యమంత్రయ్యారు. ఆ తర్వాత ఏకంగా పదేళ్ళు కేసీఆర్ పాలన సాగింది. పదేళ్ళు అధికారానికి దూరమైన కాంగ్రెస్ ఉనికి ఒక దశలో ప్రశ్నార్థకంగా మారింది. ఈ స్థితిలో 2023లో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కేసీఆర్ ను ఓడించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రేవంత్ సీఎం అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు జరిగాయి. అనూహ్య పరిణామాల మధ్య పరకాల అసెంబ్లీ నుంచి రేవూరి ప్రకాష్ రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్నికల ప్రకటన వరకూ కూడా రేవూరి బీజేపీలో కొనసాగారు. నామినేషన్ కు కొద్ది రోజుల ముందు కాంగ్రెస్ లో చేరి ఎమ్మెల్యేగా గెలుపొందడం గమనార్హం. రేవూరి గతంలో టీడీపీ నుంచి నర్సంపేట ఎమ్మెల్యేగా గెలుపొందారు. హనుమకొండ నుంచి కూడా పోటీచేశారు. ఇప్పుడు పక్క నియోజకవర్గమైన పరకాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు నియోజకవర్గ కాంగ్రెస్లో గ్రూపుల వర్గపోరు ఆ తర్వాత రోడ్డెక్కాయి. దీంతో పరకాల రాజకీయం మూడు ముక్కలాటగా మారి రాష్ట్రంలో కొత్త చర్చను లేవనెత్తింది. ప్రభుత్వసేవలను ఉపయోగించడం

పరకాల కాంగ్రెస్ లో మూడు ముక్కలాట

పరకాల కాంగ్రెస్ లో మూడు ముక్కలాట సాగుతోంది. స్థానికంగా పార్టీ కేడర్ రేవూరి, కొండా, ఇనుగాల వర్గాలుగా విడిపోయారు. ఈ విచిత్ర పరిస్థితికి పలు కారణాలున్నాయి. ఈ నియోజవర్గాన్ని ఎవరికి వారు తమ సొంత జాగీరుగా భావించడమే ఈ వివాదానికి కారణంగా భావిస్తున్నారు. గతంలో పరకాల ఎమ్మెల్యేగా పనిచేసిన, ప్రస్తుత వరంగల్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ దంపతులది ఒక గ్రూపు, గతంలో ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమిపాలైన మాజీ నియోజకవర్గ ఇంచార్జ్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాం రెడ్డిది మరో గ్రూపు, ఇక ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిది మరో గ్రూపు. ఈ గ్రూపు రాజకీయాల ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో నాయకులు బహిరంగంగా బాహాబాహికి దిగిన సందర్భాలున్నాయి. కొండా దంపతుల సొంత గ్రామం వంచనగిరి, మండలం గీసుకొండ పరకాల నియోజకవర్గంలో ఉంటోంది. గతంలో శాయంపేట ఎమ్మెల్యేగా, పరకాల కాంగ్రెస్ ఎమ్మెల్యేగా సురేఖ గెలుపొందారు. 2009లో వైఎస్ మంత్రి వర్గంలో సురేఖ పనిచేశారు. ఆయన మరణం తర్వాత మంత్రి పదవికి రాజీనామా చేసి జగన్ వెంట వైఎస్సార్సీపీలో చేరారు. 2011లో తెలంగాణ ఉద్యమ సమయంలో ఎమ్మెల్యేగా రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో పోటీ చేసి టీఆర్ఎస్ అభ్యర్థి ములుగూరి భిక్షపతి చేతిలో ఓటమిపాలయ్యారు. తర్వాత ఆ పార్టీకి రాజీనామా చేసి తిరిగి కాంగ్రెస్ లో చేరారు. కొద్ది రోజులకే ఎన్నికలురావడంతో టీఆర్ఎస్ చేరి వరంగల్ తూర్పు నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2018 ఎన్నికల్లో



తొలి జాబితాలో సురేఖకు టీఆర్ఎస్ టికెట్ నిరాకరించడంతో ఆ పార్టీకి రాజీనామా చేసి తిరిగి కాంగ్రెస్ లో చేరి తూర్పును విడిచిపెట్టి పరకాల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత చాలా కాలం స్తబ్ధంగా ఉన్న కొండా దంపతులు 2023 ఎన్నికలకు కొద్ది నెలల ముందు తిరిగి వరంగల్ తూర్పు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలిచి, రేవంత్ మంత్రివర్గంలో స్థానం సంపాదించారు. ఈ ఎన్నికల్లో పరకాల నుంచి కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఇనుగాలకు అవకాశం ఇవ్వకుండా బీజేపీ నుంచి కాంగ్రెస్ లో చేరిన రేవూరికి చాన్సు ఇవ్వడంతో అంతా ఆయన విజయానికి సహకరించారు. చట్టసభలసమాచారం పరిశీలించడం

రేవూరి, కొండా వర్గాల మధ్య వైరం:

పరకాల నియోజవర్గంలో తమ వర్గం నాయకులను రేవూరి తొక్కేస్తున్నారంటూ కొండా దంపతులు బహిరంగంగా ఎమ్మెల్యే రేవూరి పై విమర్శలు ఎక్కుపెట్టారు. ఎన్నికల ముందు తమ కాళ్ళుపట్టుకుని ఇప్పుడు తమ పై పెత్తనం చెలాయిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. రేవూరి, కొండా దంపతుల మధ్య మాటల యుద్ధం పతాకస్థాయికి చేరి రోడ్డునపడ్డారు. గీసుకొండ మండలంలో కేసులతో పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతే మంత్రిగా సురేఖ అక్కడికి వెళ్ళిన సందర్భాలు విమర్శలకు తావిచ్చింది. స్థానిక ఎన్నికల్లో ఒకే కాంగ్రెస్ పార్టీ నుంచి రేవూరి, కొండా వర్గాలు వేర్వేరు పోటీచేసి గెలుపోటములను చవిచూశారు. ఈ ఇద్దరి మధ్య వర్గపోరు తీవ్రస్థాయికి చేరిన సందర్భంలో కొండా కుటుంబం తీవ్రంగా ప్రతిస్పందించింది.

పరకాల మా అడ్డా : కొండా దంపతులు

వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తమ కుమార్తె సుస్మిత పోటీచేస్తారని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ప్రకటించగా, తాను పోటీ చేసి తీరుతానంటూ కొమ్మాల జాతర సందర్భంగా సుస్మిత కూడా బహిరంగంగా తేల్చి చెప్పారు. పరకాల మా అడ్డా అంటూ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. దాదాపు గత మూడేళ్ళుగా రేవూరి, కొండా వర్గాలు ఉప్పు నిప్పులా వ్యవహరిస్తున్నారు. నిజమైన కాంగ్రెస్ వాదులను, తమ అనుచరులను, వర్గాన్ని రేవూరి అణచివేస్తున్నారంటూ కొండా దంపతులు ఆగ్రహంతో ఉన్నారు.

ఇబ్బందుల్లో ఇనుగాల

2014లో పరకాల నుంచి ఇనుగాల కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 2023 వరకు పరకాల కాంగ్రెస్ ను పట్టుకుని ముందుకు సాగారు. 2018లో సురేఖ కోసం, 2023లో రేవూరి కోసం ఆయన పోటీ నుంచి తప్పుకున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీని కష్టకాలంలో నిలబెట్టిన ఇనుగాల వెంకట్రాం రెడ్డి ప్రాతినిధ్యం పరకాలలో లేకుండా రేవూరి ప్రయత్నిస్తున్నారని వీరి మధ్య కూడా పంచాయతీ సాగుతోంది. స్థానిక నేతగా, డీసీసీ అధ్యక్షునిగా ఉన్నప్పటికీ రేవూరి వర్గం తనను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు కొండా వర్గంతోనూ ఆయనకు విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా పరకాలలో జరిగిన సీఎం రేవంత్ సభకు డీసీసీ అధ్యక్షునిగా ఉన్నప్పటికీ ఇనుగాల గైర్హాజరు కావడం కలకలం సృష్టించింది. చట్టసభలసమాచారం పరిశీలించడం

సిట్టింగ్ రేవూరిది మరొ రకమైన ఆవేదన

పరకాల సిట్టింగ్ ఎమ్మెల్యేగా రేవూరి ప్రకాష్ రెడ్డిది మరొ రకమైన ఆవేదన. సిట్టింగ్ ఎమ్మెల్యేగా తన ప్రమేయం లేకుండా నియోజకవర్గంలో కొండా దంపతులు తనకు వ్యతిరేకంగా మరో వర్గాన్ని పెంచి పోషిస్తున్నారని అంటున్నారు. తూర్పులో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉంటూ పరకాలలో తమ పెత్తనమే సాగాలనడం సరైంది కాదంటున్నారు. ఆ మాట కొస్తే తూర్పులో పాత కాంగ్రెస్ నేతలు తమ ఆధిపత్యం సాగాలంటే ఒప్పుకుంటారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. తాము చెప్పినట్లే పరకాలలో నియోజకవర్గంలో వారి వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలంటున్నారని, నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందంటూ చెబుతున్నారు. ఇరువర్గాల ఆధిపత్యంతో పరకాల నియోజకవర్గంలో పరిస్థితి మరింత తీవ్రస్థాయికి చేరింది. ఈ విషయాన్ని రేవూరి కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్ళారు. ఎవరికి వారు పరకాల గడ్డ తమ అడ్డా అంటూ పార్టీని పక్కన పెట్టి సొంత అనుచరులతో గ్రూపులు నిర్వహించడమే దీనికి ప్రధాన కారణమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. నాయకుల వ్యక్తిగత ఆధిపత్య పోరుతో పార్టీకి నష్టం వాటిల్లుతోందని, కాంగ్రెస్ పార్టీ విజయానికి ఏళ్ళుగా ప్రయత్నిస్తున్న నిజమైన నాయకులు, కార్యకర్తలకు ఈ వర్గపోరులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉండగా తాజాగా సీఎం రేవంత్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి రేవూరి మరోసారి పోటీచేస్తారంటూ ప్రకటించడంతో కొండా వర్గం జీర్ణించుకోలేక పోతోంది.

# పెట్టుబడుల వేటలో నెంబర్ 2 గా ఏపీ

విజయవాడ, ఏపీలో కూటమి ప్రభుత్వం మరో రికార్డు సృష్టించింది. దేశంలోకి వస్తున్న కొత్త పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడంలో గణనీయంగా తన పనితీరు మెరుగుపరుచుకుంది. ప్రముఖ జాతీయ బిజినెస్ పత్రిక బిజినెస్ స్టాండర్డ్స్ ప్రాజెక్టు టుడే నివేదికల ఆధారంగా విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో జాతీయస్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది. గత రెండేళ్ల వ్యవధిలో పెట్టుబడుల ర్యాంకింగ్స్లో తొమ్మిదో స్థానం నుంచి.. ఏడు స్థానాలకు ఎగబాకి ద్వితీయ స్థానంలో నిలవడం విశేషం. ఇది నిజంగా గొప్ప విషయం. గడిచిన రెండేళ్లలో ఈ పురోగతి సాధించడం గొప్ప పరిణామం. కూటమి ప్రభుత్వానికి ఇది ఊతం ఇచ్చే విషయం.వైసిపి 2024 వరకు అధికారంలో ఉంది. ఆ ఏడాది ముగిసిన ఆర్థిక సంవత్సరంలో.. అంటే 2024 ఏప్రిల్ నాటికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీ ప్రభుత్వం దేశంలో తొమ్మిది వ స్థానంలో నిలిచింది. ఆ తదుపరి ఏడాది ఆర్థిక సంవత్సరంలో క్రమేపి పనితీరు మెరుత్కు పరుచుకుంటూ వచ్చింది. ఇప్పుడు తాజాగా టాప్ 10 జాబితాలో రెండో స్థానంలో నిలవడం విశేషం. పారిశ్రామిక వాతావరణం, ప్రభుత్వ పాలసీల్లో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్లే ఈ గణనీయమైన పురోగతి సాధ్యమైంది.పారిశ్రామిక పెట్టుబడులను సాధించడంలో మహారాష్ట్ర ముందంజలో కొనసాగుతోంది. ఇప్పుడు దాని తర్వాత స్థానం ఏపీ దక్కించుకోవడం విశేషం. ఇతర అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను తట్టుకొని ఈ స్థానంలో నిలబడడం అనేది గొప్ప విషయం. రాజస్థాన్ మూడో స్థానంలో ఉండగా.. గుజరాత్ నాలుగో స్థానంలో నిలిచింది. ఒడిస్సా 5వ స్థానంలో ఉండడం గమనించదగ్గ విషయం. అయితే పారిశ్రామికంగా ఎంతో ముందు వరుసలో ఉండే పొరుగు రాష్ట్రాలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కంటే ఏపీ చాలా వేగంగా పెట్టుబడులను ఆకర్షించిందని అర్థం అవుతోంది.అయితే పెట్టుబడులను ఆకర్షించడంలో మాత్రం ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పాత్ర ఉంది. ఒకవైపు ప్రభుత్వాన్ని నడుపుతూనే.. పెట్టుబడులను ఆకర్షించడం కోసం వీరు చేసే ప్రయత్నాలు అన్నీ ఇన్ని కావు. తరచూ విదేశీ పర్యటనలు, అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుకు వెళ్లడం.. ఇలా చాలా రకాల ప్రయత్నాలు ఫలితమే పారిశ్రామిక పెట్టుబడుల సాధనలో రెండో స్థానం. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్,, వేగవంతమైన అనుమతులు, సింగిల్ విండో సిస్టం సమర్థవంతంగా పనిచేయడం వల్లే అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. తొమ్మిదవ స్థానంలో ఉన్న ఏపీని రెండో స్థానంలో నిలపడంలో కూటమి ప్రభుత్వం సక్సెస్ కనిపిస్తోంది. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తోంది..

# బయిటకొస్తున్న గ్రూప్ వన్ చిట్టా...

కడప,ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో నిరుద్యోగ నియామకాల అంశం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీస్తోంది. డీఎస్సీ నిర్వహణలో ఎలాంటి అక్రమాలు జరగలేదని కూటమి ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ, వైఎస్ఆర్సీపీ దీనిని ప్రధాన అస్త్రంగా చేసుకుని నిరసనలకు దిగుతోంది. అయితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 నియామకాల మూల్యాంకన అక్రమాలపై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం కోర్టుకు సమర్పించిన నివేదికలో షాకింగ్ నిజాలు బయటపడటంతో వైఎస్ఆర్సీపీ ఇబ్బందుల్లో పడుతోంది. గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనంలో తీవ్రమైన ఉల్లంఘనలు, సీసీటీవీల తొలగింపు, నియమావళికి విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులతో వ్యాల్యుయేషన్ చేయించడం, రాంకీ స్లిప్పుల రీ-ప్రింటింగ్ వంటి అక్రమాలు జరిగినట్లు సిట్ విచారణలో ఆధారాలు లభించాయి. ఒక్క నిర్ణయం వెనుక నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాకుండా, నిర్దిష్ట అభ్యర్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు వ్యవస్థీకృత ప్రణాళిక నడిచిందని ఫోరెన్సిక్ ఆధారాలు చెబుతున్నాయి.సాధారణంగా నంబర్-1 స్థాయి రిక్రూట్‌మెంట్ స్కామ్‌లలో ఏజెన్సీలు నిబంధనలు ఉల్లంఘించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు లేదా బోర్డు సభ్యుల పాత్రపై దృష్టి సారిస్తాయి. గ్రూప్-1 వ్యవహారంలో నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి మరియు సంబంధిత ఉన్నతాధికారుల నిర్ణయాలపై ఇప్పటికే విచారణ సాగింది. అయితే, ఎలాంటి పొలిటికల్ గ్రీన్ సిగ్నల్ లేకుండా అంత పెద్ద వ్యవస్థాత్మక మార్పులు, ఓఎంఆర్ షీట్ల ప్రైవేటీకరణ లాంటి చర్యలు జరగడం అసాధ్యమనే వాదన బలంగా ఉంది.కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని కేవలం ఒక విభాగానికి సంబంధించిన రిక్రూట్‌మెంట్ లోపంగా చూడటం లేదు. వైఎస్ఆర్సీపీ హయాంలో ముఖ్యమంత్రి కార్యాలయం , నాటి ముఖ్య నాయకుల సూచనలతోనే ఈ నియామకాల నిబంధనల్లో మార్పులు చేశారన్న కోణంలో సాక్ష్యాధారాలు సేకరిస్తే, విచారణ రాజకీయ నేతల దాకా వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. గతంలో సిఐడి దర్యాప్తులో ఐఏఎస్ అధికారులను ప్రశ్నించినప్పుడు కొందరు ఉన్నతాధికారులు ఉన్నత స్థాయి ఒత్తిళ్ల వల్లే నిబంధనలు మార్చామని పరోక్షంగా చెప్పడం ఐఏఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.ప్రస్తుత డీఎస్సీపై పోరాటం చేయడం ద్వారా నిరుద్యోగుల మద్దతు కూడగట్టాలని చూస్తున్న వైఎస్ఆర్సీపీ గ్రూప్-1 దర్యాప్తు ఒక పెద్ద అడ్డంకిగా మారింది. మా హయాంలో సుదర్శన చక్రంలా పారదర్శకంగా మార్చాం అని చెప్పుకుంటున్నా, హైకోర్టు ఆదేశాలు , సిట్ నివేదిక వైఎస్ఆర్సీపీ వాదనను బలహీనపరుస్తున్నాయి. ఈ కేసు తీవ్రతరం అయితే, ప్రతిపక్ష నాయకులు రాజకీయంగా మరింత రక్షణలోకి వెళ్లాల్సి వస్తుందిఈ నివేదిక ఆధారంగా కోర్టు ఇచ్చే ఆదేశాలు అత్యంత కీలకం కానున్నాయి. కేవలం అడ్మినిస్ట్రేటివ్ అధికారులు మాత్రమే కాకుండా నాటి విధాన నిర్ణేతలు, ప్రభుత్వ సలహాదారులు కూడా విచారణ ఎదుర్కోవాల్సి రావచ్చు. ఇది వైఎస్ఆర్సీపీలోని అగ్రనాయకత్వానికి ఊహించని రాజకీయ ప్రతిబంధకంగా మారనుంది. ఏపీలో రాజకీయం ఇప్పుడు రిక్రూట్‌మెంట్లు, స్కామ్‌ల చుట్టూ తిరుగుతోంది. గ్రూప్-1 అక్రమాల బాధ్యతను అధికారులపై మాత్రమే నెట్టివేసి ముగిస్తారా లేక సూత్రధారులను చట్టం ముందు నిలబెట్టే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుందా అన్నది రాబోయే రోజుల్లో సిట్ ఇచ్చే తుది ఛార్జ్‌షీట్‌తో తేలనుంది.

## పోలీస్ ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చంద్రుగొండ/జూలూరుపాడు , ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని నిరుద్యోగ యువత పోలీసు ఉద్యోగాల సాధనకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఎస్.కె. వసీంపాషా కోరారు.తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు జిల్లాల నిరుద్యోగ యువత కోసం ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ శిక్షణకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.శిక్షణలో రాష్ట్రస్థాయిలో పేరొందిన అధ్యాపకులతో బోధన, ప్రామాణిక పుస్తకాల ఉచిత పంపిణీ, ప్రతిరోజూ ఓఎంఆర్ పద్ధతిలో పరీక్షలు, వారానికి ఒకసారి ప్రత్యేక పరీక్షలు, శారీరక దారుఢ్య సాధన వంటి సౌకర్యాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పోలీసు ఉద్యోగాలు సాధించేలా నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.పేర్ల నమోదుకు చివరి తేదీ: 27 ఆగస్టు 2026శిక్షణ ప్రారంభం: 1

# తమిళనాడులో కేసీఆర్ మాడల్!



హైదరాబాద్, 'పోరాడి తెలంగాణను సాధించుకున్నం.. ఒక్కో రంగాన్ని గాడిన పెట్టాలె.. ఇందులో యువతకు ఉపాధి అత్యంత కీలకం. పరిశ్రమలు రాష్ట్రానికి క్యూ కడితేనే యువతకు ఉపాధి సాధ్యం. పరిశ్రమలు రాష్ట్రానికి రావాలంటే వారికి అనుమతులను సులభతరం చేయాలి. ఇందుకు ప్రత్యేకంగా ఓ పాలసీ అవసరం..' ఇది నాడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన. ఈ ఆలోచనల నుంచి పురుడు పోసుకున్న పాలసీయే టీఎస్- ఐపాస్ (తెలంగాణ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్). నాడు బీఆర్ఎస్ హయాంలో ప్రవేశపెట్టిన ఈ పాలసీ సత్ఫలితాలు ఇవ్వడంతో గత నెలలో కేంద్ర ప్రభుత్వ మేధో సంస్థ నీతి ఆయోగ్ సైతం ప్రత్యేకంగా ప్రశంసించింది.స్థానిక నగర గైడ్‌లను పరిశీలించడందేశంలోనే ఉత్తమ విధానాల్లో ఒకటిగా టీఎస్-ఐపాస్‌ను కొనియాడింది. తాజాగా తమిళనాడులో సైతం ఇదే స్ఫూర్తితో ఇదే తరహా పాలసీని ప్రారంభించేందుకు ఆ రాష్ట్ర ప్రభు త్వం సన్నద్ధమవుతున్నది. ఈ మేరకు తాజాగా 'ఫ్యూచర్ రెడీ ఫైనాన్స్-గవర్నెన్స్, గ్రోత్ అండ్ ఇన్నోవేషన్' అనే థీమ్‌తో నిర్వహించిన 'సీఐఐ తమిళనాడు ఫైనాన్స్ కాంక్లేవ్-2026'లో పరిశ్రమల అనుమతుల్లో జాప్యానికి చెక్ పెట్టేందుకు త్వరలో కొత్త విధానాన్ని రూపొందిస్తున్నట్టు ఆ రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ ఎంఏ సిద్ధిఖీ తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 21 రోజుల్లోనే పరిశ్రమలకు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. 21 రోజుల్లో ఏవైనా కారణాలతో అనుమతులు లభించకపోతే డీమ్డ్ అప్రూవల్ అయ్యేలా పాలసీని తీసుకొస్తామని వెల్లడించారు. త్వరలో ఈ పాలసీని అసెంబ్లీలో ప్రవేశపెడుతారని చెప్పారు.

పరిశ్రమలకు ఊతమిచ్చేలా..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్.. వ్యవసాయం, సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇస్తూనే, పరిశ్రమలు రాష్ట్రానికి వస్తే యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయని భావించారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా కొత్తగా కంపెనీ పెట్టాలనుకొనే వారికి 'ఈజ్ ఆఫ్ దూయిం గ్ బిజినెస్'లో భాగంగా ప్రభుత్వ అనుమతితో పని లేకుండా మొదటిరోజు నుంచే తమ కార్యకలాపాలు సాగించేలా వ్యవస్థను రూపొందించారు. ఆన్‌లైన్ ద్వారా తమ కంపెనీ వివరాలు అందించి కేవలం 15 రోజుల్లోనే పూర్తిస్థాయి అనుమతి పొందే వెసులుబాటు తీసుకొచ్చారు. ఒకవేళ ఏదైనా కారణాలతో 15 రోజుల తర్వాత అనుమతి లభించకపోతే ఆ మరుసటిరోజు నుంచే నేరుగా ఆన్‌లైన్ ద్వారా అనుమతి వచ్చేలా టీఎస్-ఐపాస్‌ను రూపొందించారు.

## భోగాపురంలో బాదుడే...బాదుడు

విజయనగరం, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలు ప్రారంభం అయ్యాయి. నిన్నటి నుంచి పూర్తిస్థాయిలో రాకపోకలు ప్రారంభం కాగా.. తొలిరోజు 26 విమాన సర్వీసులు నడిచాయి. అయితే తొలి రోజు ప్రయాణికులకు కష్టాలు తప్పలేదు. విశాఖ నగరం నుంచి 20 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. మరోవైపు ప్రతి అరగంటకు ఒక ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కానీ ప్రతి రెండు గంటలకు ఒకసారి బస్సులను నడిపిస్తున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. పైగా భోగాపురంలో ఆర్టీసీ బస్సులను ఆపేందుకు వీలుగా ఏర్పాట్లు చేయలేదు. ఇంకోవైపు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో చార్జీల బాదుడు అధికంగా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా కమర్షియల్ వెహికల్ ఎంట్రీ, వెయిటింగ్ పేరుతో భారీగా చార్జీలు వసూలు చేస్తుండడం వివాదాలకు దారితీస్తోంది. ఒక డ్రైవర్ విమానాశ్రయ సిబ్బందిని నిలదీస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికులను తీసుకొచ్చాడు ఓ క్యాబ్ డ్రైవర్. అయితే ఆ డ్రైవర్ నుంచి సిబ్బంది ఏకంగా 600 రూపాయల కమర్షియల్ టాక్స్, వెయిటింగ్ ఛార్జ్ డిమాండ్ చేయడంతో డ్రైవర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రయాణికులను విమానాశ్రయంలో దించేందుకు 700 రూపాయలు తీసుకున్నానని.. కానీ విమానాశ్రయం లోపలికి ప్రవేశించగానే 600 రూపాయలు వసూలు చేయడం ఏంటని ప్రశ్నించాడు. ఇది ఎంత మాత్రం న్యాయం కాదని.. నిబంధనల పేరుతో క్యాబ్ డ్రైవర్లను నిలువునా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ అవుతోంది.వాస్తవానికి విమానాశ్రయం డిస్ప్లే బోర్డు పై పొందుపరిచిన పార్కింగ్, వెయిటింగ్ ఫీజుల ను మాత్రమే తీసుకోవాలి. అయితే ఈ డిస్ప్లేలో సైతం భారీగా చార్జీలు కనిపిస్తున్నాయి. అయితే తాము చెప్పినట్టుగా 600 రూపాయలు ఇవ్వాల్సిందేనని ఎయిర్పోర్ట్ సిబ్బంది డిమాండ్ చేయగా.. సదరు డ్రైవర్ మాత్రం ఇచ్చేందుకు అంగీకరించలేదు. తనకు న్యాయం జరిగే వరకు కారును ఇక్కడి నుంచి కదిలించేది లేదని భీష్మించుకుని కూర్చున్నాడు. ఉన్నతాధికారుల్లో ఎవరికి ఫిర్యాదు చేయాలో చెప్పాలంటూ పట్టుపట్టాడు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య గట్టి వాదన జరిగింది. పక్కనున్న వారు ఈ వీడియోను తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో విపరీతంగా వైరల్ అయింది.

## ఏకంగా 600 మంది ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ, ఔెం డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ సంస్థలో తీసుకున్న చర్యలను మంత్రిత్వశాఖకు వివరించారు. పరీక్షల బృందాన్ని పూర్తిగా పునర్వ్యవస్థీకరించే చర్యల్లో భాగంగా సుమారు 600 మంది నిపుణులను తొలగించి, వారి స్థానంలో కొత్త నిపుణులను నియమించనున్నారు. ప్రశ్నపత్రాల్లో పొరపాట్లు, లోపాలు లేకుండా చూసేందుకు నాలుగు అంచెల తనిఖీ వ్యవస్థను తీసుకురానున్నారు. ఔెంలో వచ్చే రెండు నుంచి మూడు వారాల్లో మరో 20-25 మంది అధికారులను నియమించనున్నట్లు విద్యాశాఖ తెలిపింది. భవిష్యత్‌లో మరిన్ని నియామకాలు చేపట్టే ప్రణాళికపైనా సమీక్ష నిర్వహించినట్లు పేర్కొంది. అంతేకాకుండా ఔెం కార్యాలయాలను కొత్త భవనాలకు యుద్ధప్రాతిపదికన తరలించనున్నారు. కార్యాలయాల భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బందిని మోహరించనున్నారు. ప్రశ్నపత్రం లీకేజీ వివాదం, ఇటీవల యూజీసీ నెట్ పరీక్షల్లో తలెత్తిన సమస్యలపై కేంద్ర విద్యాశాఖ తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు, పరీక్షల నిర్వహణలో పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తడంతో ఔెంలో సంస్కరణలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రల్హాద్ జోషి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో పరీక్షల నిర్వహణకు అవసరమైన భద్రతా, మౌలిక సదుపాయాలను పటిష్టం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.ఇటీవల నెట్ జూన్ 2026 పరీక్షలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టుల్లో పరీక్షలను మళ్లీ నిర్వహించాలని ఔెం ప్రకటించింది. ఈ మూడు ప్రశ్నపత్రాల్లో వాస్తవపరమైన తప్పులు, టైపింగ్ పొరపాట్లు, అనువాద లోపాలు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు నిపుణుల కమిటీ గుర్తించింది. దీంతో అవి న్యాయమైన, లోపరహిత పరీక్ష ప్రమాణాలకు అనుగుణంగా లేవని కమిటీ తేల్చింది. పరీక్షల నిర్వహణలో లోపాలపై చర్యల్లో భాగంగా జూలైలోనే 47 మంది ఔెం అధికారుల సేవలను ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా మరో 600 మంది నిపుణులను తొలగించి కొత్త వారిని నియమించే ప్రక్రియ చేపట్టడంతో భారీ స్థాయిలో ప్రక్షాళన జరుగుతోంది.పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక చర్య చేపట్టింది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అన్యాయ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు-2026ను పార్లమెంట్ ఇటీవల ముగిసిన వర్షాకాల సమావేశాల్లో ఆమోదించింది. పేపర్ లీకేజీ కేసుల్లో కఠిన శిక్షలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, నిర్ణీత గడువులో విచారణ వంటి నిబంధనలను ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. పేపర్ లీకేజీ, నిరసన చేస్తున్న విద్యార్థులపై జూలై 20న జరిగిన పోలీసు చర్యల నేపథ్యంలో పార్లమెంట్ ఉభయ సభల్లో తీవ్ర గందరగోళం నెలకొన్న తర్వాత ఈ బిల్లుకు ఆమోదం లభించింది. మొత్తంగా ఔెంలో చేపడుతున్న తాజా సంస్కరణలు పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రత, ప్రశ్నపత్రాల నాణ్యతను పెంచడమే లక్ష్యంగా సాగుతున్నాయి.

## పూడుకుపోయిన కాల్వ ...

(భద్రాద్రి న్యూస్): పంట పొలాలకు సక్రమంగా నీళ్లు అందించాల్సిన బాధ్యతను విస్మరిస్తున్న అధికారుల తీరు వల్ల రైతాంగం నష్టపోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరగాల్సిన పనులపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ఇరిగేషన్ శాఖ తీరుతో తాలిపేరు ప్రాజెక్టు కింద సాగునీరు రైతుల పొలాలకు వెళ్లే విషయంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి అయినా సరే పట్టించుకునే నాధుడే కరువయ్యారు చర్ల , రైతుల పంట పొలాలకు చేరాల్సిన తాలిపేరు ప్రాజెక్టు సాగునీరు అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డుపాలవుతోంది. రాళ్లగూడెం గ్రామ పరిధిలో సాగునీటి కాలువ పూడిక, చెత్తాచెదారంతో పూర్తిగా నిండిపోవడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడి, పొలాలకు వెళ్లాల్సిన నీరు ప్రధాన రహదారిపైకి పొంగిపొర్లుతోంది. దీంతో విలువైన సాగునీరు వృథాగా పోతుండగా.. రైతులు మాత్రం పంటలకు నీటి కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.రైతుల పొలాలకు నీరు చేరేలా కాలువలను నిర్వహించడం ఇరిగేషన్ శాఖ ప్రాథమిక బాధ్యత కాదా? అని గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. కాలువలో పూడిక పేరుకుపోయి నీరు పొలాలకు వెళ్లకుండా రోడ్డుపైకి వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. రైతులకు అందాల్సిన నీటిని సక్రమంగా మళ్లించలేని పరిస్థితి ఉంటే తాలిపేరు ప్రాజెక్టు నీటి ప్రయోజనం రైతులకు ఎలా అందుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రతి చుక్క నీరు రైతుకు ప్రాణాధారం.. అధికారులు మాత్రం పట్టించుకోరా?ఇప్పటికే వర్షాలు సరిగా లేక సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రాజెక్టు నుంచి అందుబాటులోకి వస్తున్న నీటిని సైతం కాలువల నిర్వహణ లోపంతో రోడ్డుపైకి

# జెన్ జెడ్‌తో 'కమలం' అప్రమత్తం




న్యూఢిల్లీ,గత జూన్, జులైలో బిజెపి ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన పరిణామాలు సంభవించాయి. జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా నేతృత్వంలో సాగిన విద్యార్థులు, యువత నిరసనలు కేంద్ర విద్యామంత్రిని గద్దెనుంచి దింపగలిగాయి. ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా హాజరు కాకుండానే, ఎలాంటి చర్చలు జరగకుండానే ప్రతిపక్షాల విమర్శల పిడుగులతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నీరుగారిపోయాయి. బంకీపూర్ సహా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఉపఎన్నికల ఫలితాలు కాషాయ నాథులకు చుక్కలు చూపించాయి. దీంతో కేంద్ర బిజెపి నాయకత్వానికే కాదు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో కూడా వణుకుపుట్టి భవిష్యత్‌ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఎలా మార్చుకోవాలన్న తాపత్రయం ప్రారంభమైంది. ముఖ్యంగా యువతను, విద్యార్థులను లక్షంగా చేసుకుని ఎర్రకోటపై నుంచి ప్రధాని సప్తధార పథకాలను ప్రకటించినా యువతలో బిజెపికి అనుకూలమైన మార్పు వస్తుందని చెప్పలేం. దిమాగీ నక్సల్స్ అనే కొత్త పదాన్ని తెరపైకి మోడీ తీసుకు రావడం స్పందనగా దిమాగీ నక్సల్స్ పేరున మరో కొత్త పార్టీ రానుండడం ఇవన్నీ కాషాయ నాథులు ఊహించనివి.అందుకనే పైనుంచి కింది వరకు పార్టీలో భారీ ఎత్తున బిజెపి నాయకత్వం మార్పులకు శ్రీకారం చుట్టింది. దశాబ్ద కాలంగా మోడీ అనుసరిస్తున్న రాజకీయ భావజాలం, ద్వేష భాష ప్రయోగాన్ని ఇప్పుడు పక్కన పెట్టి వాస్తవాల ఆధారంగా విశ్వసనీయమైన సిద్ధాంతాలకు ప్రచారాలకు ప్రాముఖ్యత కల్పించవలసిన అవసరం కమలనాథులకు ఏర్పడింది. సోమవారం నాడు చేపట్టిన సంస్థాగత మార్పులు, కేవలం పదవుల మార్పిడి, మాత్రమే కాదు, త్వరలో జరగనున్న కొన్ని అసెంబ్లీ ఎన్నికలలో ఎలా నెగ్గుకు రావాలన్న దృష్టితో కూడిన వ్యూహాలు కూడా ఉన్నాయి. 45 ఏళ్ల నితిన్ నబీన్‌ను బిజెపి జాతీయ అధ్యక్షుడుగా ఎంచుకుని ఏడు నెలలు గడిచిన తర్వాత ఈ మార్పులు జరగడం విశేషం. ఈ మార్పుల్లో యువతతోపాటు అనుభవజ్ఞులకు కూడా స్థానం కల్పించారు. ఈ నియామకాలలో అత్యంత చర్చనీయాంశం స్మృతి ఇరానీని తిరిగి కీలక పదవిలోకి తీసుకు రావడం, అదే సమయంలో పార్టీ ఐటి సెల్ చీఫ్ అమిత్ మాల్వీయను తొలగించడం. త్వరలో ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్ నుంచి ఎనిమిది మంది కొత్తగా నియమితులైన పార్టీ కార్యకర్తల్లో ఇద్దరు ముస్లింలు ఉన్నారు. పార్టీకి చెందిన వివిధ విభాగాలకు కొత్త నాయకత్వాన్ని సమకూర్చాలనే నబీన్ ప్రయత్నంలో భాగంగా కేంద్ర బృందంలో 12 మంది మహిళలకు స్థానం కల్పించారు.వారిలో ఆరుగురిని ఉపాధ్యక్షులుగా చేశారు. దక్షిణ భారతం విషయానికి వస్తే ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు, కేరళ నుంచి ఇద్దరు, కర్ణాటక నుంచి ఒకరు, తమిళనాడు నుంచి ఒకరు, కొత్త బృందంలో చోటు సంపాదించారు. తెలంగాణకు మాత్రం చోటు లభించకపోవడం గమనార్హం. దేశం లోనే అత్యధిక జనాభా ఉన్న ఉత్తర ప్రదేశ్‌లో బిజెపికి ఈసారి అత్యంత కఠినమైన పరీక్ష ఎదురుకానున్న సమయంలో ఉత్తరప్రదేశ్ పార్టీ జనరల్ సెక్రటరీగా స్మృతి ఇరానీని తిరిగి నియమించడం చెప్పుకోదగిన విశేషం. 2024 ఎన్నికల్లో అమేథీలో ఓడిపోయిన తరువాత ఇరానీ కొంతకాలంగా రాజకీయంగా దూరమయ్యారు. ఇప్పుడు ఆమెకు మళ్లీ కీలక బాధ్యతలు అప్పగించారు. అనుభవజ్ఞుడైన జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డే ఎన్నికల సన్నాహాలను పర్యవేక్షించనున్నారు. గత పదేళ్లుగా యోగీ ఆదిత్యనాథ్ పాలనలోని ఉత్తరప్రదేశ్‌లో ఓటర్లలో విసుగు పుట్టిందని, ముఖ్యంగా జెన్ జెడ్ యువతలో నిరాశ కనిపిస్తోందని విపక్షాలు గట్టిగా ప్రచారం చేస్తున్నాయి. అయోధ్య రామమందిరం విరాళాల చోరీ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి కొంత అప్రతిష్ట తెచ్చిపెట్టింది. అయితే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన దర్యాప్తు బృందం అయోధ్య రామాలయ ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు విరాళాల చోరీ కేసులో క్లీన్‌చిట్ ఇచ్చింది. ఇదెంతవరకు ప్రభావం చూపుతుందో చెప్పలేం.పంజాబ్‌పై తన పంజా విసరాలని కమలనాథులు వ్యూహాలు రూపొందిస్తున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ఇటీవలనే బిజెపిలో చేరిన సందీప్ పాఠక్‌ను జాతీయ బృందం లోకి తీసుకున్నారు. ఈ మార్పుల్లో మరో ముఖ్యమైన అంశం అమిత్ మాల్వీయను తొలగించడం. ఆయన స్థానంలో చత్తీస్‌గఢ్‌కు చెందిన దీపక్ మ్హాస్కేను నియమించారు. పార్టీ పరంగా ఐటి, సోషల్ మీడియా వ్యవస్థను కొత్తగా బలోపేతం చేయడమే దీని లక్షం. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ రూపొందించడంలో మ్హాస్కేకు ప్రత్యేక నైపుణ్యం ఉంది. జెన్ జెడ్ రీల్స్‌ను ఉపయోగించి తమ ఉద్యమాన్ని ఉధృతం చేసిందన్న నమ్మకంతో ప్రధాని మోడీ కూడా ఇప్పుడు రీల్స్‌పై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. అంతేకాదు, మంత్రులు, పార్టీ నేతలు ఇలాంటి ఆధునిక ఫార్మాట్లను, సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించాలని సూచిస్తున్నారు. సోషల్ మీడియాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా, సంయమనంతో వ్యవహరించాలని సూచిస్తున్నారు. వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉండాలని, తప్పుడు సమాచారం,ఫేక్ న్యూస్ వ్యాప్తి చేయరాదని, ద్వేషపూరిత ప్రసంగాలతో రెచ్చగొట్టే పోస్టులు ఉండరాదని, రాజకీయ ప్రత్యర్థులపై అసభ్యకరమైన భాష వాడరాదని, వాస్తవాలు, విధానాలు, అభివృద్ధి అంశాలపై చర్చకే ప్రాధాన్యం ఇవ్వాలని హితవు పలుకుతున్నారు. ఈ మార్పులు సంగతి ఎలా ఉన్నా అసలు పరీక్ష ఇక ముందుంది. కొత్తగా వచ్చిన యువ నాయకత్వానికి స్వతంత్ర రాజకీయ గళాన్ని వినిపించే అవకాశం కేంద్రం లోని కమలనాథులు ఇస్తారా? సంస్థపై బలమైన పట్టుగల పాతతరం నాయకత్వం భిన్నాభిప్రాయాలను అణచివేస్తూ కొత్తతరం గొంతులను అణగదొక్కుతారా? అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

## తెలంగాణలో నిరుద్యోగులకు ఊరట

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో యూనిఫామ్ ధరించి సమాజానికి సేవ చేయాలనే లక్షల మంది నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయంతో భారీ ఊరటనిచ్చింది. గత కొంతకాలంగా నోటిఫికేషన్ల ఆలస్యం, కరోనా తదనంతర పరిణామాల వల్ల వయసు మించిపోయి ఆందోళన చెందుతున్న అభ్యర్థుల విన్నపాలను ప్రభుత్వం సానుకూలంగా మన్నించింది. ఈ క్రమంలోనే వివిధ యూనిఫామ్ సర్వీసెస్ శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు గరిష్ట వయోపరిమితిని అదనంగా మరో రెండేళ్లు పెంచుతూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన తాజా జీవో నెంబర్ 122 ప్రకారం రాష్ట్రంలోని ఏడు ప్రధాన యూనిఫామ్ శాఖల్లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు లభించనుంది. ఇప్పటికే మే 18, 2026 నుంచి ప్రభుత్వం ఐదేళ్ల వయోపరిమితి పెంపును అమలు చేస్తోంది. ఇప్పుడు దానికి అదనంగా మరో రెండేళ్లు జోడించడంతో అభ్యర్థులకు లభించే మొత్తం వయోసడలింపు ఏకంగా 7ఏళ్లు చేరింది. దీని వల్ల వయసు పైబడి పోటీకి దూరమవుతున్న వేలాది మంది అభ్యర్థులకు మళ్లీ ప్రాణం పోసినట్టు అయ్యింది.ఈ వయోపరిమితి పెంపు వర్తించే ప్రధాన శాఖలు ఏంటంటే... తెలంగాణ పోలీస్ శాఖ అయిన సివిల్ ఎస్ఐ కానిస్టేబుల్, ఏఆర్, టీఎస్ఎస్‌పీ , కమ్యూనికేషన్స్ పోస్టులకు వర్తిస్తుంది. అగ్నిమాపక శాఖలోని ఫైర్‌మెన్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్స్ పోస్టులకు ఇది అమలు అవుతుంది. జైళ్ల శాఖ డిప్యూటీ జైలర్, వార్డర్ పోస్టుల్లో వర్తింపజేస్తారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఎక్సైజ్ శాఖ, రవాణా శాఖ, అటవీ శాఖలోని ఉద్యోగాలకు కూడా వర్తింపజేస్తారు.

ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుంది?

ఈ వయోపరిమితి పెంపు నిర్ణయం కేవలం భవిష్యత్‌లో వచ్చే నోటిఫికేషన్లకే పరిమితం కాదు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న పోలీస్ నియామక ప్రక్రియకు కూడా ఈ ఏడేళ్ల సడలింపు వర్తిస్తుందని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. దీంతో ఇప్పటికే అప్లై చేయలేకపోయిన అభ్యర్థులకు మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి అవకాశం కల్పించే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంతో సామాన్య కేటగిరీ అభ్యర్థులతోపాటు రిజర్వేషన్ వర్గాల వారికి కూడా గరిష్ట వయస్సు గణనీయంగా పెరిగింది.

| ఉద్యోగ హోదా | బేసిక్ వయోపరిమితి | పాత సడలింపు | కొత్త సడలింపుతో కలిపి ఎంత | కొత్త గరిష్ట అర్హత వయసు |
|---|---|---|---|---|
| పోలీస్ కానిస్టేబుల్ | 22 ఏళ్లు | 27 ఏళ్లు | +7 ఏళ్లు | 29 ఏళ్లు |
| సబ్‌ఇన్స్‌పెక్టర్ | 25 ఏళ్లు | 30 ఏళ్లు | +7ఏళ్లు | 32 ఏళ్లు |
| ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ | 31 ఏళ్లు | 36 ఏళ్లు | +7ఏళ్లు | 38 ఏళ్లు |

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు పై పేర్కొన్న ఏడేళ్ల సడలింపుతోపాటు వారి కేటగిరీకి వర్తించే అదనపు 5 ఏళ్ల మినహాయింపు కూడా అందుబాటులో ఉంటుంది. దీని వల్ల రిజర్వేషన్ అభ్యర్థులకు కానిస్టేబుల్ పోస్టులకు గరిష్టంగా 34 ఏళ్ల వరకు, ఎస్ పోస్టులకు 37 ఏళ్ల వరకు పోటీ పడే అవకాశం లభిస్తుంది.

# క్షేత్రస్థాయి కేడర్ పై జగన్ గురి...



విజయవాడ, నెల్లూరు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయంగా మరోసారి ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాన్ని వేగవంతం చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత కొంతకాలం పార్టీ కార్యాలయానికే పరిమితమైన ఆయన ఇటీవల వరుస పర్యటనలు చేపడుతున్నారు. ఈ పర్యటనలు కేవలం పార్టీ నేతలను పరామర్శించేందుకే కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల పరిస్థితిని అర్థం చేసుకునేందుకు కూడా ఉపయోగపడుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.జగన్‌కు దాదాపు రెండు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉంది. ఈ కాలంలో ఎదురైన విజయాలు, పరాజయాల నుంచి ఆయన ఎన్నో విషయాలు నేర్చుకున్నారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజల స్పందనను అంచనా వేయడంలో జగన్‌కు మంచి అవగాహన ఉందనే అభిప్రాయం ఆయన అనుచరుల్లో ఉంది. గత ఎన్నికల్లో పార్టీకి ఎదురైన ఫలితాలకు కేవలం ప్రభుత్వ వ్యతిరేకత మాత్రమే కారణం కాదని, సంస్థాగతంగా జరిగిన లోపాలు కూడా కీలక పాత్ర పోషించాయని వైసీపీ నాయకత్వం గుర్తించినట్లు తెలుస్తోంది.ఎన్నికల అనంతరం పార్టీ శ్రేణుల్లో కొంత నిరుత్సాహం కనిపించింది. పలువురు నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా క్రియాశీలత తగ్గించుకోవడంతో క్షేత్రస్థాయిలో వైసీపీ బలహీనపడిందనే భావన ఏర్పడింది. ఈ నేపథ్యంలో జగన్ స్వయంగా ప్రజల్లోకి రావడం పార్టీ క్యాడర్‌కు కొత్త ధైర్యాన్ని ఇచ్చిందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.ఇటీవల గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర, కర్నూలు ప్రాంతాల్లో జగన్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఆయనను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం పార్టీ నాయకుల్లో ఆసక్తిని పెంచింది. ఈ స్పందనను వైసీపీ నాయకత్వం రాజకీయంగా అనుకూల సంకేతంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల్లో పార్టీకి పూర్తిగా ఆదరణ తగ్గిపోలేదని, సరైన కార్యక్రమాలతో తిరిగి బలపడే అవకాశం ఉందనే నమ్మకం కార్యకర్తల్లో ఏర్పడుతోందని సమాచారంఅయితే కేవలం జనసమీకరణతోనే రాజకీయ విజయాన్ని సాధించడం సాధ్యం కాదనే విషయం కూడా వైసీపీకి తెలుసని పరిశీలకులు అంటున్నారు. గతంలో జరిగిన సంస్థాగత లోపాలను సరిదిద్దడం, నియోజకవర్గ స్థాయిలో నాయకుల మధ్య సమన్వయం పెంచడం, కార్యకర్తలను మళ్లీ చురుగ్గా పనిచేసేలా చేయడం కీలకంగా మారనుంది. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడంతో పాటు పార్టీకి స్పష్టమైన కార్యాచరణ అవసరం.ఇదే సమయంలో జగన్ పర్యటనలు కూటమి పార్టీల్లో కూడా రాజకీయ చర్చకు కారణమవుతున్నాయని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న దశలో ప్రతిపక్ష నేతగా జగన్ ప్రజల్లో చురుగ్గా తిరగడం రాబోయే రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపవచ్చనే అంచనాలు ఉన్నాయి.మొత్తంగా చూస్తే జగన్ పర్యటనలు వైసీపీకి రాజకీయంగా మళ్లీ చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. ఇకపై కూడా ఇదే దూకుడును కొనసాగిస్తూ జిల్లాల వారీగా పర్యటనలు నిర్వహించాలని పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల మధ్య నిరంతరం ఉంటూ పార్టీని పునర్నిర్మించడమే లక్ష్యంగా జగన్ ముందుకు సాగితే, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరిన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది

మండలిలో..

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలి రోజే ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్‌సీపీ అనుసరించిన వ్యూహాత్మక వైఖరి రాజకీయంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. ప్రజా సమస్యలపై పోరాడేందుకు దక్కిన అత్యున్నత రాజ్యాంగ వేదికైన శాసనసభను బహిష్కరించి, కేవలం శాసనమండలిలో డీఎస్సీపై వాయిదా తీర్మానం ఇవ్వడం ద్వారా ఆ పార్టీ తన బలహీనతను తానే బయటపెట్టుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసెంబ్లీలో ప్రజాప్రతినిధులుగా గొంతు విప్పాల్సిన 11 మంది ఎమ్మెల్యేలు సభకు రాకుండా ముఖం చాటేయడం పార్టీ ప్రజాస్వామిక విశ్వసనీయతను ప్రజల్లో తీవ్రంగా దెబ్బతీస్తోంది.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పూర్తి గణాంకాలతో ప్రతిపక్ష వైఖరిని ఎండగడుతూ.. అసెంబ్లీకి వచ్చి డీఎస్సీ సహా ఏ అంశంపైనైనా చర్చించాలని పదేపదే విసిరిన సవాల్‌కు వైఎస్సార్‌సీపీ నుంచి అత్యంత పేలవమైన స్పందన వచ్చింది. సభలో ఉన్న ప్రజాప్రతినిధులెవరూ ఆ సవాల్‌ను స్వీకరించే సాహసం చేయకపోగా, సభకు వచ్చే అర్హతే లేని మాజీ మంత్రి పేర్ని నాని బయట మీడియా ముందుకొచ్చి తాను చర్చకు వస్తానని ప్రకటించడం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేసింది. ఎన్నికైన 11 మంది ఎమ్మెల్యేలలో ఏ ఒక్కరూ లోకేష్ సవాల్‌ను ఎదుర్కొనేందుకు ముందుకు రాకపోవడం పార్టీలోని నాయకత్వ లోపాన్ని స్పష్టం చేస్తోంది.ప్రజా సమస్యలపై సభలో నిలదీయకుండా గురువారం నాటి ప్రెస్ మీట్‌కు వాయిదా వేసుకోవడం ద్వారా ప్రతిపక్షం తనకు తానే రాజకీయంగా మరింత ఆత్మరక్షణలో పడింది. అప్పటివరకు అసెంబ్లీ వేదికగా కూటమి ప్రభుత్వం నిరాటంకంగా ప్రతిపక్ష వైఫల్యాలను, గత ఐదేళ్ల పాలనా లోపాలను ఎండగడుతూనే ఉంటుంది. శాసనసభ రికార్డుల్లో నమోదయ్యే అధికారిక చర్చలకు ఉండే రాజ్యాంగబద్ధమైన విలువ, మీడియా పాయింట్ల వద్ద లేదా పార్టీ కార్యాలయాల్లో పెట్టే ప్రెస్ మీట్లకు ఎప్పటికీ ఉండదనే ప్రాథమిక పార్లమెంటరీ సూత్రాన్ని వైఎస్సార్‌సీపీ విస్మరించడం చర్చనీయాంశంగా మారింది.ప్రజాస్వామ్యంలో అధికార పక్షం తప్పులను ఎత్తిచూపేందుకు దక్కిన సంఖ్యాబలాన్ని సద్వినియోగం చేసుకోకుండా, కేవలం మైకు ఇవ్వలేదనో లేక ప్రతిపక్ష హోదా రాలేదనో సాకులు చెబుతూ సభా వేదికల నుంచి పారిపోవడం ప్రజల్లో మరింత చులకన భావాన్ని పెంచుతుంది. ప్రెస్ మీట్లు, సోషల్ మీడియా పోస్టులతో కేవలం తమ సొంత కేడర్‌ను మాత్రమే సంతృప్తిపరచగలరు తప్ప, శాసనసభ వేదికగా ప్రజలకు జవాబుదారీతనాన్ని చాటుకోలేరు. ఈ పార్లమెంటరీ వ్యూహాత్మక తప్పిదాలను సరిదిద్దుకోకపోతే ప్రతిపక్షంగా వైఎస్సార్‌సీపీ రాజకీయ మనుగడ మరింత క్లిష్టతరంగా మారే ప్రమాదం ఉంది.

### సైబరాబాద్ లో ముగ్గురు డ్రగ్ పెడ్లర్స్ అరెస్ట్

హైదరాబాద్,శేరిలింగంపల్లిలో పోలీసులు ముగ్గురు డ్రగ్ సెడ్లర్స్ ను అరెస్టు చేసారు. వారినుంచి 94 గ్రాముల ఎటఎజీ డ్రగ్, 50 గ్రామ్స్ ఓజీ డ్రగ్ సీజ్ చేసారు. ఈ నెల 11 వ తేదీన గచ్చిబౌలి పీఎస్ లిమిట్స్ వట్టినాగులపల్లి లో ఒక డ్రగ్ పెడ్లర్ డ్రగ్స్ సప్లై చేస్తుండగా పట్టుకున్నాం.. నిందుతుని తో పాటు 16 మంది కంజ్యూమర్లను అదుపులోకి తీసుకున్నాం.. నిందితుడు యస్వంత్ సాయి ని విచారించగ బెంగళూరు కు చెందిన నవీనా, కేరళ కు చెందిన అబ్దుల్ గఫూర్ ల నుండి డ్రగ్ తెచ్చినట్లు వెల్లడి అయింది.

## బలపడుతున్న అనుమానాలు...

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవలి కాలంలో కొన్ని కీలక ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకాకపోవడం, టీడీపీ-జనసేన సోషల్ మీడియా గ్రూపుల మధ్య నడుస్తున్న సైలెంట్ వార్ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవలి కాలంలో కొన్ని కీలక ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకాకపోవడం, టీడీపీ-జనసేన సోషల్ మీడియా గ్రూపుల మధ్య నడుస్తున్న సైలెంట్ వార్ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. పవన్ కల్యాణ్ కేబినెట్ సమావేశం, సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభోత్సవం , రాజ్‌భవన్‌లో గవర్నర్ ఏర్పాటు చేసిన ఎట్ హోమ్ కార్యక్రమానికి దూరంగా ఉండటాన్ని వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున హైలైట్ చేసే ప్రయత్నం చేసింది. కూటమిలో విభేదాలు మొదలయ్యాయని ప్రచారం ప్రారంభించిందిఅగ్రనాయకులు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ పరస్పర గౌరవంతోనే ముందుకు సాగుతున్నప్పటికీ.. సోషల్ మీడియా వేదికగా కిందిస్థాయి కార్యకర్తలు, సానుభూతిపరుల మధ్య వివాదాలు ముదురుతుండటం ప్రతికూల అంశంగా మారింది. స్థానిక నియోజకవర్గాల్లో ప్రాధాన్యత, పనుల కేటాయింపులు, పోస్టింగ్స్ విషయంలో టీడీపీ-జనసేన శ్రేణుల మధ్య అసంతృప్తులు కనిపిస్తున్నాయి. ఒకరినొకరు టార్గెట్ చేసుకుంటూ పోస్టులు పెట్టుకోవడం ప్రత్యర్థులకు మంచి ఆయుధంగా మారుతోంది. అయితే ఈ సోషల్ మీడియా రచ్చను అరికట్టేందుకు ఇప్పటికే ఇరు పార్టీల అధినాయకత్వాలు హెచ్చరికలు జారీ చేస్తూ పరిస్థితిని కంట్రోల్ చేసే ప్రయత్నం చేస్తున్నాయి.వైసీపీ శ్రేణులు కూటమి దెబ్బతిందని ఎంత ప్రచారం చేస్తున్నప్పటికీ, సాధారణ ప్రజల్లో గానీ, ఓటర్లలో గానీ ఈ కథనాలపై విశ్వసనీయత కనిపించడం లేదు. 2024 ఎన్నికల్లో వచ్చిన భారీ విజయం కూటమి పునాది ఎంత బలంగా ఉందో స్పష్టం చేసింది. ప్రభుత్వపరంగా కీలక నిర్ణయాలు, సంక్షేమ పథకాల అమలు, అమరావతి పునర్నిర్మాణం వంటి ప్రతిష్టాత్మక అంశాల్లో చంద్రబాబు-పవన్ కల్యాణ్ ఇద్దరూ ఒకే మాటపై నడుస్తున్నారు. కాబట్టి కొన్ని చిన్న చిన్న గైర్హాజరులు , సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా కూటమి బంధం బలహీనపడిందని వారు ఆనందపడే ప్రయత్నం చేస్తోంది.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కూటమికి అసలైన సవాలుగా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల విజయాన్ని క్షేత్రస్థాయిలో నిలబెట్టుకోవాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల మధ్య సంపూర్ణ సమన్వయం అవసరం. గ్రామ స్థాయిలో స్థానాల సర్దుబాటు, నామినేషన్ల ఖరారు విషయంలో ఇరు పార్టీల మధ్య ఎలాంటి ఘర్షణ వాతావరణం రాకుండా చూసుకోవడమే అధినేతలకున్న పెద్ద టాస్క్. కింది స్థాయి క్యాడర్‌ను ఒకే వేదికపైకి తెచ్చి పోటీకి దించగలిగితే కూటమి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించవచ్చు. పవన్ కల్యాణ్ గైర్హాజరుపై వస్తున్న ఊహాగానాలకు తెరపడాలంటే ఇరు పార్టీలు మరింత వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సి ఉంది.

## బీసీలకు 34% రిజర్వేషన్

గోనెగండ్ల: ఎమ్మెల్యే బి.వి. జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ గోనెగండ్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ శ్రీ నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కీలకంగా వ్యవహరించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం బీసీలకు 24 శాతం రిజర్వేషన్లు మాత్రమే కల్పించిందని, కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచిందని పేర్కొన్నారు. బీసీల సంక్షేమం, సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు


నీలగిరి శంఖారావమ్ తెలుగు దినపత్రిక
RNI No.TELTEL/2022/86880
NEELAGIRI SHANKARAVAMU TELUGU DAILY


# సాగర్ రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీకీ డైరక్ట్ వే...



నల్గొండ, ఆగస్టు 20, నాగార్జున సాగర్ రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీకీ అనుసంధానించే 11.8 కి.మీ రహదారి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. తక్కళ్లపల్లి, మేడిపల్లి గ్రామాల పరిధిలో ఇప్పటికే ఉన్న 6 కి.మీ రహదారిని రెండు లైన్లుగా విస్తరించగా.. మరో 5.8 కి.మీ మేర టీజీఐఐసీ సేకరించిన భూముల్లో కొత్త రోడ్డును నిర్మిస్తున్నారు. మె?త్తం 7 మీటర్ల వెడల్పుతో భారీ వాహనాలకు అనుకు?లంగా ఈ రోడ్డును తీర్చిదిద్దుతున్నారు. ప్రాజెక్టుకు రూ.30 కోట్లు కేటాయించారు. రానున్న వారం రోజుల్లోనే ఈ ప్రాజెక్టు పనులు పూర్తయ్యే ఛాన్సుంది.తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లతో పాటు ఫోర్త్ సిటీగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నారు. ఇప్పటికే అక్కడ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో పాటు పలు కార్యాలయాల పనులు మె?దలయ్యాయి. ఇక ఫ్యూచర్ సిటీని చేరుకునేందుకు ప్రత్యేకంగా రోడ్లు కూడా వేయిస్తున్నారు. ఫ్యూచర్ సిటీకి రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే దిశగా తాజాగా మరో కీలక అడుగు పడింది. నాగార్జునసాగర్ రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీ ప్రాంతాన్ని కనెక్ట్ చేసే రహదారి నిర్మాణ పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. యాచారం మండలం తక్కళ్లపల్లి గేట్ నుంచి మేడిపల్లి సమీపం వరకు కొనసాగుతున్న ఈ పనులు పూర్తయితే ఫ్యూచర్ సిటీకి మరో రోడ్డు అందుబాటులోకి రానుంది. అక్కడ చేపట్టనున్న నిర్మాణాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులకు అవసరమైన సామగ్రి రవాణా మరింత సులభతరం కానుంది.ప్రస్తుతం ఉన్న రోడ్డును ఆధునీకరించడంతో పాటు అవసరమైన చోట కొత్త రహదారిని అధికారులు నిర్మిస్తున్నారు. మొత్తం 11.8 కిలోమీటర్ల పొడవున ఈ మార్గాన్ని అత్యాధునికంగా డెవలప్ చేస్తున్నారు. యాచారం మండలం తక్కళ్లపల్లి, మేడిపల్లి గ్రామాల పరిధిలో ఇప్పటికే ఉన్న సుమారు 6 కిలోమీటర్ల పొడవైన ఒక వరుస రహదారిని రెండు వరుసలుగా విస్తరించారు. మరో 5.8 కిలోమీటర్ల మేర మేడిపల్లి నుంచి తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సేకరించిన భూముల్లో కొత్తగా మరో రహదారిని నిర్మిస్తున్నారు. ఈ కొత్త రహదారి కోసం తక్కళ్లపల్లి, మేడిపల్లి గ్రామాల పరిధిలో రైతుల నుంచి సుమారు ఏడు ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. మొత్తం రోడ్డును ఏడు మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నారు. రానున్న కాలంలో ఫ్యూచర్ సిటీ పరిధిలో భారీ స్థాయిలో నిర్మాణాలు చేపట్టనున్న నేపథ్యంలో భారీ వెహికల్స్ సైతం సులభంగా రాకపోకలు సాగించేలా ఈ కొత్త రహదారి నిర్మాణానికి అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో రోడ్లు, కనెక్టివిటీ కీలక మౌలిక వసతులుగా మారనున్నాయి. కొత్త పరిశ్రమలు, సంస్థలు, వాణిజ్య కార్యకలాపాలు, ఇతర నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఉక్కు, యంత్ర సామగ్రి తదితరాలను తరలించేందుకు ప్రత్యేకంగా అనుకూలమైన రోడ్లను అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్ రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీ వైపు నిర్మిస్తున్న ఈ రోడ్డు కీలక రవాణా మార్గంగా ఉపయోగపడనుంది. ఈ రహదారి నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సుమారు రూ.30 కోట్లు కేటాయించింది. తారు నిర్మాణ పనులను రెండు రోజుల క్రితమే ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే రానున్న వారం రోజుల్లోనే పూర్తి స్థాయిలో పనులు పూర్తయ్యే అవకాశం ఉందని టీజీఐఐసీ జెడ్ఎం స్మరత్‌చంద్ర తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలన్న రేవంత్ సర్కార్ ప్రణాళికలో భాగంగా కనెక్టివిటీకి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రధాన రహదారులతో అనుసంధానం పెరిగే కొద్దీ భవిష్యత్తులో ఈ ప్రాంతంలో రవాణా, పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలు మరింత వేగం పుంజుకునే ఛాన్సుంది. ప్రస్తుత రహదారి పూర్తయితే ఫ్యూచర్ సిటీ నిర్మాణ పనులకు మాత్రమే కాకుండా పరిసర గ్రామాలకు కూడా మెరుగైన కనెక్టివిటీ లభించనుంది.

# సంక్షేమ పథకాలు చుట్టూ దుమారం




హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో మరోసారి సంక్షేమ పథకాల చుట్టూ తీవ్ర దుమారం రేగుతోంది. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం అమలవుతున్న ప్రతిష్టాత్మక కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసేందుకు కుట్ర చేస్తోందంటూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఊరూరా కాంగ్రెస్ నేతలను నిలదీయాలని, లబ్ధిదారుల పక్షాన నిలబడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈ పథకాలపై ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులే తాజా రాజకీయ వివాదానికి ప్రధాన ఆజ్యం పోశాయి. 2014 నుంచి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుకు సంబంధించి జారీ చేసిన 8 జీవోలకు అసెంబ్లీ చట్టబద్ధత లేదంటూ ఒక న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం, ఆ జీవోలపై స్టే విధిస్తూ చెల్లింపులను నిలిపివేయాలని మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం తరఫున సకాలంలో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడం వల్లే కోర్టు స్టే ఇచ్చిందని, కోర్టు వ్యవహారాన్ని సాకుగా చూపి రూ. 1,00,116 ఆర్థిక సాయం అందించే పథకాలను పూర్తిగా ఎత్తివేసే ఆలోచనలో కాంగ్రెస్ ఉందని బీఆర్ఎస్ నేతలు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తదితరులు తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నారు. ఈ వివాదం ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చింది కాదు. ఇందుకు పలు కీలక అంశాలు కారణమవుతున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ కల్యాణ లక్ష్మి సాయంతో పాటు 'తులం బంగారం' ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చాక నిబంధనల రూపకల్పన, ఖజానాపై పడే అదనపు భారం తదితర కారణాలతో ఈ హామీ పూర్తిస్థాయిలో పట్టాలెక్కకపోవడం ప్రతిపక్షానికి రాజకీయ అస్త్రంగా మారింది. బోగస్ లబ్ధిదారులను ఏరివేసేందుకు క్షేత్రస్థాయి పరిశీలనలు చేపట్టడం వల్ల వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో పడి చెల్లింపుల్లో జాప్యం జరిగింది. దీనిని బీఆర్ఎస్ పథకం నిలిపివేతగా ప్రచారం చేస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి బ్రాండ్‌గా నిలిచిన కేసీఆర్ కిట్, రైతుబీమా, కల్యాణ లక్ష్మి వంటి పథకాలను ప్రస్తుత ప్రభుత్వం క్రమంగా పక్కన పెడుతోందనే రాజకీయ విమర్శను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే వ్యూహాన్ని గులాబీ పార్టీ అమలు చేస్తోంది. క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలిస్తే, ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకాన్ని రద్దు చేస్తున్నట్లు ఎక్కడా అధికారికంగా ప్రకటించలేదు. వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ద్వారా ఈ పథకాలకు నిధుల కేటాయింపులు కూడా కొనసాగుతున్నాయి. హైకోర్టు స్టే వ్యవహారంలోనూ ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ నేతలు కొట్టిపారేస్తున్నారు. న్యాయపరమైన చిక్కులను అధిగమించడానికి త్వరలోనే పటిష్టమైన కౌంటర్ దాఖలు చేసి, అవసరమైతే చట్టసభ ఆమోదంతో పథకానికి రక్షణ కల్పిస్తామని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సంక్షేమాన్ని తాము మరింత పారదర్శకంగా అమలు చేయాలని చూస్తుంటే, బీఆర్ఎస్ ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని కాంగ్రెస్ ఎదురుదాడి చేస్తోంది. తెలంగాణలో మహిళా ఓటు బ్యాంకు అత్యంత కీలకం కావడంతో, కల్యాణ లక్ష్మి వంటి పథకంపై జరుగుతున్న ఈ యుద్ధం కేవలం సంక్షేమానికి సంబంధించినది మాత్రమే కాదు.. పూర్తిస్థాయి రాజకీయ ఆధిపత్య పోరాటంగా మారింది. కోర్టులో ప్రభుత్వ కౌంటర్, తులం బంగారం అమలుపై అధికార పక్షం ఇచ్చే స్పష్టతే ఈ రగడకు ముగింపు పలకనుంది.

# కమలం... కొత్త వ్యూహం..



హైదరాబాద్, తెలంగాణలో 2028 ఎన్నికల్లో అధికారం సాధించాలనే స్పష్టమైన లక్ష్యంతో బీజేపీ అధిష్టానం కీలక వ్యూహాలకు పదును పెడుతోంది. పార్టీ బలోపేతం, సంస్థాగత పునర్నిర్మాణం, నాయకత్వ సర్దుబాట్లు ఇవన్నీ ఒకే దిశలో కదులుతున్నాయి. ఈ ప్రక్రియలో పది మందితో కమిటీ ఏర్పాటు, జాతీయ కార్యవర్గం నుంచి కొందరు నాయకులను తప్పించడం, నవంబర్ నుంచి పూర్తి ఫోకస్ వంటివి ముఖ్యమైన అంశాలుగా కొత్త వ్యూహంలో భాగంగా ఉన్నాయి. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడానికి, కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి పది మందితో కమిటీని ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయి నుంచి నాయకత్వ వరకు ఉన్న లోపాలను గుర్తించి, నిర్దిష్ట చర్యలు చేపట్టే దిశగా ఈ కమిటీ పని చేస్తుంది. తెలంగాణలో బీజేపీ ఇంకా స్థిరమైన సామాజిక, ప్రాంతీయ బలాన్ని సాధించలేదన్న భావనతోనే ఈ కమిటీ పనిచేస్తుందిబండి సంజయ్, కె. లక్ష్మణ్, డీకే అరుణలను జాతీయ కార్యవర్గం నుంచి తప్పించడం కేవలం పరిపాలనా మార్పు కాదు. పార్టీ వర్గాల ప్రకారం ఇది తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించే వ్యూహంలో భాగం. జాతీయ స్థాయి బాధ్యతల నుంచి విముక్తి చేయడం ద్వారా వారిని రాష్ట్ర స్థాయి పనులపై పూర్తి శ్రద్ధ పెట్టే అవకాశం కల్పించింది. ఇది అంతర్గత సమతుల్యతను కాపాడుతూ, రాష్ట్ర కార్యాచరణను వేగవంతం చేసే ప్రయత్నంగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. నవంబర్ నుంచి తెలంగాణపై బీజేపీ పూర్తి దృష్టి పెట్టనుంది. ఈ సమయంలో రాష్ట్ర కమిటీలో బండి సంజయ్, ఈటల రాజేందర్‌లకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని సమాచారం. ఇది అనుభవజ్ఞులైన నాయకులను ముందుకు తీసుకువచ్చి, సంస్థాగతంగా, రాజకీయంగా బలమైన బృందాన్ని తయారు చేస్తుంది. 2023 ఎన్నికల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, మరింత సమన్వయంతో కార్యాచరణ సాగించాలన్న ప్రణాళికతో ముందుకెళ్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్ర, బీజేపీ మూడో స్థానంలో ఉంది. 2028 ఎన్నికల నాటికి త్రిముఖ పోరులు బిజెపిని ముందు నిలిపేలా అధిష్టానం వ్యూహాత్మకంగా పావులు కలుగుతుంది. బీజేపీకి ఇంకా విస్తృత సామాజిక బేస్, స్థిరమైన నాయకత్వం, స్థానిక సమస్యలపై స్పష్టమైన ప్రత్యామ్నాయం అవసరం. 10 మెన్ కమిటీ, నాయకత్వ సర్దుబాట్లు, నవంబర్ నుంచి పూర్తి ఫోకస్.. ఇవన్నీ దీర్ఘకాలిక ప్రణా ళికలో భాగంగా కనిపిస్తున్నాయి. 2028 లక్ష్యం చాలా దూరంగా ఉన్నప్పటికీ, ఇప్పటి నుంచే సంస్థాగత పునాదులు వేయాలనేది అధిష్టానం ఆలోచన. బీజేపీ తెలంగాణలో కేవలం ప్రతిపక్ష పాత్రకే పరిమితం కాకుండా, అధికార పార్టీగా మార్చాలని స్పష్టమైన లక్ష్యంతో అధినాయకత్వం చర్యలు చేపట్టింది.

# కొండ వెనక దాగున్నది ఎవరు ?




హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వంలో, కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. గత ఏడాది అక్టోబరులో మేడారం జాతర పనులు తమకు ఇవ్వలేదని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా ఆరోపణలు చేసింది. ఆ తర్వాత కొండా సురేఖ క్షమాపణలు చెప్పడంతో ఆ వివాదం టీ కప్పులో తుఫానులా సమసిపోయింది. తాజాగా వరంగల్ జిల్లా పర్యటన నేపథ్యంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల నేపథ్యంలో ఆమె కూతురు కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యలు మరోసారి వివాదానికి ఆజ్యం పోశాయి. ఈ సారి పూర్తిగా రేవంత్ రెడ్డి లక్ష్యంగా ఉండడం ఉత్కంఠ రేపుతున్నది. తాజాగా వరంగల్ పర్యటన సంధర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుండి తిరిగి ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పోటీ చేస్తారని, ప్రజలు తిరిగి గెలిపించాలని అన్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే నిన్న వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గం గీసుకొండలో జరిగిన కొండా సురేఖ జన్మదిన వేడుకలలో కొండా సుష్మిత స్పందించారు. 'వచ్చే ఎన్నికల్లో పరకాల నుండి తానే పోటీ చేస్తానని, యువతకు అవకాశాలు ఇస్తానని చెబుతున్న రేవంత్ రెడ్డి 70 ఏళ్లు పైబడిన రేవూరి ప్రకాష్ రెడ్డికి టికెట్ ఇస్తానని ఎలా చెబుతారని, సంగారెడ్డిలో జగ్గారెడ్డికి టికెట్ ఏఐసీసీ ఇస్తుందన్న రేవంత్ రెడ్డి, ఇక్కడ మాత్రం తాను ఎలా ప్రకటన చేస్తారని ప్రశ్నించింది. గతంలో పీసీసీ అధ్యక్షుడుగా రేవంత్ రెడ్డి ఉండాలని తన తల్లి కొండా సురేఖ, తండ్రి కొండా మురళి ప్రతిపాదించారని, తమ ఇంటికి వచ్చి కాంగ్రెస్ పార్టీకి 34 సీట్లు వస్తే కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించింది. సీతా దయాకర్ రెడ్డి ఎవరని ఆమెకు పదవి ఇచ్చారని, బీసీ మంత్రుల ఫోటోలు ప్రకటనలలో ఎందుకు వేయడం లేదని, పొంగులేటి పొంగు ఎంతో సేపు నిలవదని, రేవంత్ రెడ్డి తమ్ముడికి రూ.200 కోట్ల భూమి కట్టబెట్టారని, తన వ్యాఖ్యలకు స్పందిస్తే మరిన్ని అక్రమాలు బయటపెడతానని హెచ్చరించడం గమనార్హం. అయితే సరిగ్గా ఈ నెల 13న కొండా సురేఖ ఒక ప్రముఖ దినపత్రికలో "పాలించే ప్రభువు కాదు. కలిసి పనిచేసే గుంపుమేస్త్రీ' అంటూ వ్యాసం రాసింది. సరిగ్గా వారం తిరగకముందే కొండా సురేఖ కూతురు ఇంత ఘాటు వ్యాఖ్యలు చేయడం వెనక కారణం ఏంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ సీనియర్లు దయాసాగర్, షబ్బీర్ అలీలను ప్రస్తావించడంతో పాటు, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డిల గురించి ప్రస్తావించడం అనుమానాలకు తావిస్తుంది. ఎలాంటి చర్చ లేకుండా కొండా సుష్మిత ఇలాంటి ఘాటు వ్యాఖ్యలు చేసే అవకాశం లేదని, ఖచ్చితంగా తెరవెనక జరుగుతున్న దానికి అనుగుణంగానే తెర ముందు సుష్మిత ఇలాంటి వ్యాఖ్యలు చేసిందని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. అసలు కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ అనే వ్యాఖ్యలు కూడా వ్యూహాత్మకమేనని, రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ సీనియర్లు కొండా కుటుంబాన్ని ముందు పెట్టి మాట్లాడిస్తున్నారని అంటున్నారు. కొద్ది రోజుల క్రితమే కొండా మురళి తన కూతురు వచ్చే ఎన్నికల్లో పరకాల నుండి పోటీ చేస్తుందని, రాబోయే 20 ఏళ్లు తనే ఎమ్మెల్యే అని ప్రకటించారు. దానికి భిన్నంగా రేవంత్ స్పందించిన నేపథ్యంలో దమ్ముంటే ఇప్పుడే రేవూరి ప్రకాష్ రెడ్డితో రాజీనామా చేయించి రేవంత్ రెడ్డి అతడికి మద్దతుగా ప్రచారం చేయాలని, తాను స్వతంత్రంగా పోటీ చేసి గెలుస్తానని సుష్మిత సవాల్ విసిరింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం బుధవారం రాత్రి కొండా సుష్మిత వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు ఇచ్చింది. మరో వైపు పది రోజుల విదేశీ పర్యటన నిమిత్తం సీఎం రేవంత్ రెడ్డి అమెరికా, బ్రిటన్ దేశాల సందర్శనకు బయలుదేరారు. ఈ లోపు తెలంగాణలోని కాంగ్రెస్ రాజకీయాలు ఏ మలుపులు తిరుగుతాయో అని అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. కొండా కుటుంబం చేస్తున్న వ్యాఖ్యలు వారి వ్యక్తిగతమా ? లేక పార్టీలోని కొందరు సీనియర్లు ఆడిస్తున్న ఆటనా అనేది కూడా తేలాల్సి ఉంది.

# రేవంత్ సర్కార్‌కు గుదిబండగా పొంగులేటి!?



హైదరాబాద్, ఆగస్టు 20, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా కనిపించిన సమాచార, పౌర సంబంధా, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చుట్టూ ఇప్పుడు వరుస వివాదాలు చుట్టుముడుతున్నాయి. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది సామాన్యుల ఆస్తులను తాకుతూ పెను దుమారాన్ని రేపుతున్న 22-ఎ సంక్షోభం రెవెన్యూ శాఖకు నేతృత్వం వహిస్తున్న పొంగులేటిని నేరుగా ఇరుకున పెట్టింది. మరోవైపు ఆయన కుటుంబ వ్యాపారాలు, వ్యక్తిగత వ్యవహారాలు నిరంతరం అధికార పక్షానికి తలనొప్పిగా మారుతున్నాయి. గతంలో ఆయన కుమారుడికి సంబంధించిన లగ్జరీ వాచీల స్మగ్లింగ్, హవాలా ఆరోపణల కేసుల్లో ఈడీ, డీఆర్ఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆయన నివాసాలు, కార్యాలయాలపై వరుస దాడులు నిర్వహించడం ప్రభుత్వ ఇమేజ్‌పై తీవ్ర ప్రభావం చూపింది. దీనికితోడు, గతంలో కేవలం ప్రభుత్వ కాంట్రాక్టులకే పరిమితమైన కుటుంబ సంస్థ 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' ఇటీవలి కాలంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలోని వట్టినాగులపల్లి వంటి కీలక ప్రాంతాల్లో వేల కోట్ల రూపాయల భారీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లోకి ప్రవేశించడం, ఆ క్రమంలో భూ వివాదాలు, పోలీస్ కేసులు నమోదు కావడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వంలో కీలక కాంట్రాక్టులు, ప్రాజెక్టులు ఒకే సంస్థకు దక్కుతున్నాయనే అసంతృప్తి కాంగ్రెస్ అంతర్గత విభాగాల్లోనూ క్రమంగా బయటపడుతోంది. గతంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వంటి సొంత పార్టీ శాసనసభ్యులే బహిరంగంగా ఆరోపణలు చేశారు. కొండా సురేఖ కూడా అదే తరహాలో ఆరోపణలు చేశారు. ఇక రెవెన్యూ శాఖలో కొనసాగుతున్న అవినీతిని, వివాదాస్పద భూములను ప్రొహిబిటెడ్ లిస్టులో పెట్టి సెటిల్మెంట్లు చేసుకుంటున్నారంటూ వస్తున్న ఆరోపణలతో అధికార పార్టీ మరింత ఆత్మరక్షణ ధోరణిలోకి పడిపోయింది. కేడర్ కోసం ఏళ్ల తరబడి పోరాడిన స్థానిక నేతలను విస్మరించి, వ్యాపార ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారన్న భావన క్షేత్రస్థాయి కాంగ్రెస్ శ్రేణుల్లో బలపడుతోంది. ఇన్ని ప్రతికూలతలు, వివాదాలు చుట్టుముట్టినా ఆయన పట్టు తగ్గకపోవడానికి ప్రధాన కారణం ఢిల్లీ కాంగ్రెస్ హైకమాండ్‌తో ఉన్న బలమైన ఆర్థిక, రాజకీయ బంధాలేనని భావిస్తున్నారు. జాతీయ స్థాయిలో పార్టీకి ఆర్థికంగా అండగా నిలవడం, వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినప్పుడల్లా వనరుల సమకూర్పులో కీలకంగా వ్యవహరించడం వల్లే ఆయన పలుకుబడి కొనసాగుతోందనే గుసగుసలు పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. పారదర్శక పాలన, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మంత్రి పొంగులేటి చుట్టూ ముసురుకుంటున్న వివాదాలు ఒక పెద్ద 'మైనస్'గా మారాయన్నది క్యాడర్ అభిప్రాయం. సామాన్యుల ఆస్తి హక్కులను దెబ్బతీసే 22-ఎ వివాదం నుంచి మొదలుకొని, కుటుంబ వ్యాపార వివాదాల వరకు అన్నీ సర్కారు గ్రాఫ్‌ను దెబ్బతీస్తున్నాయిని అందరూ గట్టిగా నమ్ముతున్నారు

# తెలుగు రాష్ట్రాల్లో కోటి ఓట్లు మిస్సింగ్



హైదరాబాద్, కేంద్ర ఎన్నికల సంఘం తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో చేపట్టిన సమగ్ర ప్రక్షాళన ప్రక్రియ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. రెండు రాష్ట్రాల్లో కలిపి సాంకేతికంగా కోటి ఇరవై లక్షలకు పైగా ఓట్లు చెల్లుబాటు కాకుండా పోతున్నాయి. జాబితా నుంచి తొలగింపునకు గురవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ కీలకమే అయినప్పటికీ, ప్రధాన రాజకీయ పార్టీలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేయకపోవడం, సైలెంట్‌గా ఉండటం వెనుక ఏం జరుగుతోంది? వాస్తవానికి ఈ గల్లంతు ప్రక్రియ అంతా అర్హులైన ఓటర్లను తొలగించడం కాదని, ఓటర్ల జాబితాను క్లీన్ క్రమంలో జరుగుతున్న సాంకేతిక ప్రక్రియ అని పార్టీలకు స్పష్టమైన అవగాహన ఉంది. ఉమ్మడి రాష్ట్ర విడిపోయాక , హైదరాబాద్ కేంద్రంగా స్థ స్థిరపడిన లక్షలాది మందికి ఏపీ, తెలంగాణ రెండింటిలోనూ ఓట్లు ఉన్నాయి. దీనికి తోడు మరణించిన వారి పేర్లు తొలగించకపోవడం, ఆధార్‌తో ఎపిక్ సీడింగ్ జరగడం వల్ల ఈ డూప్లికేట్ , ఇన్-యాక్టివ్ ఓట్లను ఈసీ వ్యవస్థ పసిగట్టి తొలగిస్తోంది. ఇది ఓటు హక్కును కాలరాయడం కాదని తెలిసే ప్రధాన పార్టీలు దీనిపై వీధిపోరాటాలకు దిగడం లేదు. అయితే, తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ అంశాన్ని చాలా సీరియస్‌గా తీసుకుని ఈసీ వద్ద తరచూ ఫిర్యాదులు చేస్తోంది. దీని వెనుక కాంగ్రెస్ పార్టీకి బలమైన రాజకీయ సమీకరణాలు ఉన్నాయి. గడిచిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే, పట్టణ ప్రాంతాల్లో ఉన్న బోగస్, డబుల్ ఓట్లు ఫలితాలను ప్రభావితం చేశాయని కాంగ్రెస్ భావిస్తోంది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ, ఇతర పట్టణాల్లోనూ క్రమబద్ధీకరణ జరిగితే క్లీన్ ఓటర్ లిస్ట్ వల్ల తమకే పొలిటికల్ అడ్వాంటేజ్ ఉంటుందని కాంగ్రెస్ లెక్కిస్తోంది. అందుకే ప్రతి బూత్ స్థాయిలో తమ బూత్ లెవల్ ఏజెంట్లను అలర్ట్ చేస్తూ, తొలగింపులను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. మరోవైపు బీఆర్ఎస్, వైసీపీ, టీడీపీ-జనసేన కూటమి సైలెంట్‌గా ఉండటానికి కారణం.. క్షేత్రస్థాయి రియాలిటీయే. ఆయా పార్టీల అంతర్గత సర్వేల ప్రకారం, తొలగింపునకు గురవుతున్న ఓట్లలో అత్యధికం నివాసాలు మారిన వారివి, లేదా డబుల్ ఓటింగ్‌కు అవకాశం ఉన్నవే. ఒకవేళ పొరపాటున నిజమైన ఓటరు పేరు తొలిగినా, వారిని మళ్లీ ఫారమ్-6 ద్వారా దరఖాస్తు చేయించి ఓటరుగా నమోదు చేయించవచ్చనే సాంకేతిక వెసులుబాటు ఈసీ కల్పిస్తోంది. రచ్చ చేయడం కంటే క్షేత్రస్థాయిలో బిఎల్ఓ ల వద్ద తమ ఏజెంట్ల ద్వారా ఓట్ల పునరుద్ధరణ చేయించుకోవడమే ఉత్తమ మార్గమని పార్టీల భావన. వాస్తవానికి ఎన్నికల సంఘం పారదర్శకంగా ఫారమ్-7 దరఖాస్తులు, క్లెయిమ్స్ , అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియను నిర్వహిస్తుండటంతో చట్టపరంగా దీన్ని ప్రశ్నించే అవకాశం తక్కువగా ఉంది. కోటి ఇరవై లక్షల ఓట్ల ప్రక్షాళన అనేది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే క్రమంలో జరుగుతున్న ఒక ప్రక్షాళన. నిరసనలు, ఆందోళనల కంటే నిశ్శబ్దంగా బూత్ స్థాయిలో తమ మద్దతుదారుల ఓట్లు జాబితాలో ఉండేలా చూసుకోవడమే రాజకీంగా ప్రయోజనకరమని భావించి పార్టీలు వ్యూహాత్మక మౌనాన్ని పాటిస్తున్నాయి. తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియ ముగింపు దశకు చేరుకోవడంతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం అధికారికంగా ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. రాష్ట్రంలోని మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లలో 2.64 కోట్లకు పైగా మంది ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించగా, వీరి పేర్లను ముసాయిదా జాబితాలో చేర్చారు. క్షేత్రస్థాయిలో డోర్-టు-డోర్ వెరిఫికేషన్ పూర్తయిన అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఈ ముసాయిదా వివరాలను వెల్లడించారుమరోవైపు, ఎన్యుమరేషన్ సర్వే సమయంలో దాదాపు 73.39 లక్షల అంటే 21.7 శాతం ఎంట్రీలు అన్‌కలెక్టబుల్ కేటగిరీ కింద నమోదై ముసాయిదా జాబితా నుంచి తాత్కాలికంగా తొలగింపునకు గురయ్యాయి. వీటిలో శాశ్వతంగా నివాసాలు మారిన వారు , డబుల్ ఎంట్రీలు , మరణించిన వ్యక్తుల వివరాలు ఉన్నట్లు సీఈవో ప్రకటించారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి వంటి పట్టణ ప్రాంతాల్లోనే ఈ తరహా వలస , అన్‌ట్రేసబుల్ ఓటర్ల సంఖ్య భారీగా నమోదైంది. ఓటర్ల సంఖ్య , నివాస ప్రాంతాల మార్పుల ఆధారంగా ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ స్టేషన్ల సంఖ్య 36,353కి పెరిగింది. ఓటర్లు తమ నివాసాలకు సమీపంలో సులభంగా ఓటు హక్కు వినియోగించుకునేలా, రద్దీని నివారించేందుకు వీలుగా ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల పరిమితిని క్రమబద్ధీకరించారు. ముసాయిదా జాబితాలో పేర్లు లేని లేదా తప్పులు దొర్లిన అర్హులైన పౌరులకు మరో అవకాశం కల్పిస్తూ అభ్యంతరాలు, చేర్పుల గడువును అధికారులు ప్రకటించారు. దీని ప్రకారం సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ కొనసాగుతుంది. ఓటర్లు తమ స్థితిని సరిచూసుకుని దరఖాస్తు చేసుకోవచ్చని, అనంతరం అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా ప్రచురించనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140